### సిగాచీ ఫార్మా ప్రమాదంలో దంపతులు దుర్మరణం

హైదరాబాద్ : పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు ఘటన పలు కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ ప్రమాదంలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయాలతో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో కూడా 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మరో 27 మంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది. ఈ ప్రమాద మృతుల్లో రెండు నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్న దంపతులు కూడా ఉన్నారు. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి, ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నామాల శ్రీరమ్య రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ ఆషాడ మాసం తర్వాత బంధుమిత్రులను ఆహ్వానించి పెద్దల సమక్షంలో ఘనంగా వేడుకలు జరుపుకుందని అనుకున్నారు.కానీ ఇంతలో విధి వక్రించింది. సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఫార్మా కంపెనీలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పేలుడు ఘటనలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. దాంతో వారి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి.

# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :111 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 02-07-2025 | పేజీలు:4 వెల: 2.00

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. నలుగురు మృతి

తమిళనాడులో ప్రమాదం చోటు చేసుకుంది. ఓ బాణసంచా ఫ్యాక్టరీ లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయపడ్డారు. విరుదునగర్ జిల్లాలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా ఎస్పీ కన్నన్ తెలిపిన వివరాల ప్రకారం.. శివకాశి సమీపంలోని చిన్నకామన్‌పట్టి లో గల బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విరుదునగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కన్నన్ తెలిపారు.



## రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు.

హైదరాబాద్ : రాష్ట్రంలో మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇవాళ, రేపు (మంగళ, బుధ వారాల్లో) తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాష్ట్రం అంతటా ఆకాశం మేఘావృతమై ఉన్నదని పేర్కొంది. ఈ నెల 3, 4 తేదీల్లో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశముందని చెప్పింది.కాగా నగరంలో గత రాత్రి భారీ వర్షం పడింది. పంజాగుట్ట, లక్డీకాపూల్, మలక్‌పేట, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, షేక్‌పేట, ఖాజాగూడ, మణికొండ, మేడ్చల్, సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీగా వరదనీరు నిలిచింది. లక్డీకాపూల్ ద్వారకా హోటల్ కూడలిలో నిలిచిన నీటిని హైడ్రా సిబ్బంది మ్యాన్‌హోళ్లలోకి మళ్లించారు. బలమైన ఈదురుగాలులవల్ల మణికొండ,



అత్తాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

## డీకే శివకుమార్‌కు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు.

కర్ణాటక లో ముఖ్యమంత్రి మార్పుపై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి పీఠంపై డీకే శివకుమార్ , సీఎం సిద్ధరామయ్య ఇద్దరూ చెరో రెండున్నరేళ్లు ఉంటారని సమాచారం. ఈ క్రమంలో అక్టోబర్‌లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని కొందరు కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. ఈ వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఆ పార్టీ జనరల్ సెక్రటరీ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా కర్ణాటక పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన పార్టీ ఎమ్మెల్యేలతో కూడా సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ గందరగోళం వేళ ఉప ముఖ్యమంత్రి డీకేకి సన్నిహితుడిగా పేరొందిన ఓ ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మెజారిటీ ఎమ్మెల్యేలు 'మార్పు' కోరుకుంటున్నట్లు చెప్పారు. దాదాపు 100 మంది ఎమ్మెల్యేలు శివకుమార్‌కు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ.. 'నేను ఒక్కడిని కాదు.. మెజారిటీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి మార్పు కోరుకుంటున్నారు. 100 మందికిపైగా ఎమ్మెల్యేలు డీకే శివకుమార్‌కు మద్దతు ఇస్తున్నారు. వారిలో చాలా మంది మార్పు కోసం ఎదరుచూస్తున్నారు. మంచి పాలన కోరుకుంటున్నారు. సిద్ధరామయ్యను తొలగించి.. డీకే శివకుమార్‌ను సీఎంని చేయాలి. ఆయన



పార్టీ కోసం అవిశ్రాంతంగా పనిచేశారు. పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. కేపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి అందరూ చూశారు. అందుకే మెజారిటీ ప్రజలు ఆయన్నే సీఎంగా కోరుకుంటున్నారు. ముఖ్యమంత్రి మార్పు అంశం గురించి నేను సుర్జేవాలాతో మాట్లాడతాను. ఇప్పుడు మార్పు జరగకపోతే.. 2028లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని నిలుపుకోలేదు. ప్రస్తుతం పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సీఎం మార్పు చాలా అవసరం' అని అన్నారు.

## లక్ష్యాన్ని మించి బొగ్గు ఉత్పత్తి సాధించిన బెల్లంపల్లి ఏరియా గనులు

రెబ్బెన జూలై 01 : బెల్లంపల్లి ఏరియాలోని గనులు జూన్ మాసంలో 131 శాతంతో బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూన్ మాసానికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసిపికి 2.00 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా 131 శాతంతో 2.62 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. బెల్లంపల్లి ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించడం కోసం సమిష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసిపి ప్రారంభోత్సవం కోసం సింగరేణి యాజమాన్యం తీవ్రమైన కసరత్తు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం స్టేజ్ వన్ అనుమతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరియాలో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. దానిలో భాగంగా గోలేటి



టౌన్షిప్ కార్మిక కాలనీలో నివాసముంటున్న వారికోసం కొత్తగా నాలుగు బోర్లు ఏర్పాటు చేసి మంచినీరు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్ ఓ టు జి ఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడి ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ హెచ్ ఓ డి రాజేశ్వరరావు, సీనియర్ పిఓ ప్రశాంత్ ఉన్నారు.

## ఇద్దరు మావోయిస్టుల మృతి

కొత్తగూడెం జూలై 1: ఒడిశా దండకారణ్యంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడితో సహా పార్టీ సభ్యుడు మృతి చెందారు. ఈ ఘటన కంధమల్ జిల్లా లో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. ఒడిశా రాష్ట్రం కంధమల్ జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని సుఖాలద గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారాసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పును ప్రారంభించారు. %జవాన్ల దాటికి తాళలేక మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు నక్సలైట్లు మృతి చెందారు. మృతి చెందిన వారిలో కేకేబీఎన్ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు మంకు కాగా పార్టీ సభ్యుడు చందన్ గా పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలం నుంచి ఒక



303 రైఫిల్, ఒక పిస్టల్ తో పాటు మావోయిస్టులకు సంబంధించిన ఇతర ఆయుధ వస్తు, సామాగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నారు.

## పాశమైలారం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం..

హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం ప్రమాద ఘటనపై నిపుణులతో కమిటీ వేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమిటీలో కొత్తవాళ్లకు చోటు కల్పించాలని, ఈ ఘటనపై ఇప్పటికే నివేదిక ఇచ్చినవాళ్లు కమిటీలో ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలన్నారు. పాశమైలారంలోని సిగాచి కెమికల్స్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 42 మంది కార్మికులు, సిబ్బంది మరణించారు. ఈ నేపథ్యంలో మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రమాద ప్రాంతంలో భవన శిథిలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ అనుమతులు, భద్రతా ప్రమాణాలపై వివరాలు, సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రమాదానికి ముందు పరిశ్రమను తనిఖీ చేశారా అని కంపెనీ ప్రతినిధిని ప్రశ్నించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం చెప్పాలన్నారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఇచ్చే పరిహారంపై ప్రశ్నించారు. ఇలాంటి సమయంలో




కంపెనీ యాజమాన్యం మానవత్వంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రమాద కారణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. ఇప్పటికే తనిఖీ చేసిన అధికారులతో కాకుండా కొత్తవారితో జరిపించాలని, జరిపి పూర్తి నివేదిక అందించాలన్నారు. గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా, జరిగితే కారణాలేంటో తెలుసుకోవాలన్నారు.

## గుర్తుపట్టలేని స్థితిలో 20 మృతదేహాలు

పటాన్‌చెరు: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. రియాక్టర్ పేలుడుతో ఇప్పటివరకు 45 మంది మరణించారు. వివిధ దవాఖానల్లో మరో 31 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మరణించినవారిలో ఎక్కువ మంది తమిళనాడు, బీహార్, జార?ండ్ రాష్ట్రాలకు చెందినవారే ఉన్నారు. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను గుర్తించగా, మరో 20 గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. సోమవారం జగన్మోహన్, రామ్‌సింగ్ రాజ్‌బర్, శశిభూషణ్ కుమార్ మృతిచెందినట్లు గుర్తించగా, తాజాగా మరో ఆరుగురి పేర్లను అధికారులు ప్రకటించారు. లగ్నజిత్ దౌరి, బీ.హేమ సుందర్, రుక్సానా కతూన్, జీ.నికిల్ రెడ్డి, నాగేశ్వర్ రావు, పొలిషెట్టి ప్రసన్నగా గుర్తించారు. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉన్నది. అయితే మృతుల సంఖ్య 55కు పెరిగే అవకాశం ఉంది.బాయిలర్ పేలడంతో మూడంతస్తుల అడ్మినిస్ట్రేషన్ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఆ శిథిలాల కింద 20 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారి కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, రెవెన్యూ, హైడ్రా, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ధ్వంసమైన ప్లాంట్‌ను పక్కకు



తొలగించారు.కాగా, ప్రమాదంపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఉదయం అధికారిక ప్రకటన చేశారు. మొత్తం 47 మంది గల్లంతయ్యారని, ఇప్పటి వరకు 26 మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని తెలిపారు. 20 మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయని చెప్పారు. 27 మంది కార్మికుల ఆచూకీ తెలియాలేదన్నారు. తీవ్ర గాయాలతో 35 మందికి దవాఖానల్లో చికిత్స అందుతున్నదని, అందులో 11 మంది పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. 57 మంది సురక్షితంగా ఇంటికి వెళ్లారని తెలిపారు.

## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే


సుల్తానాబాద్ రూరల్ జూలై 1: సంక్షేమం దిశగా ప్రభుత్వం పని చేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రామారావు అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని నరసయ్య పల్లి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు పర్యటించారు. పెద్దమ్మతల్లి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి, సిసి రోడ్లులకు భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మంజూరు పత్రాలు అందజేసి, ముగ్గురు పోశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘం భవనానికి రూ.10 లక్షల వరకు, పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలోని ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షలను మంజూరు చేస్తామన్నారు. %ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతట అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, తాసిల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు,



నాయకులు జూపల్లి తిరుమలరావు, సాయి మహేందర్, పన్నాల రాములు, దామోదర్ రావు, సతీష్ , జానీ, సత్యనారాయణ రావు, బల్మూరి వెంకటరమణారావు, గ్రామస్తులు తదితరులున్నారు.

## షుగర్ మిల్‌లోకి పోటెత్తిన వరద..

హర్యానా లో గత రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ఆసియాలోనే అతిపెద్ద షుగర్ మిల్‌లోకి వరద పోటెత్తింది. దీంతో దాదాపు రూ.50 కోట్ల విలువైన పంచదార కరిగిపోయింది. %హర్యానాలోని యమునానగర్ లో గల సరస్వతి చక్కెర కర్మాగారానికి ఆసియాలోనే అతిపెద్ద షుగర్ మిల్‌గా పేరుంది. అయితే, గత రాత్రి కురిసిన భారీ వర్షానికి మిల్‌లోకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో అందులో స్టోర్ చేసిన పంచదార నీటిపాలైంది. రూ.90 కోట్ల విలువైన 2,20,000 క్వింటాళ్ల చక్కెర నిల్వ చేయగా.. అందులో 40 శాతంమేర కరిగిపోయినట్లు మిల్ అధికారులు తెలిపారు. దాదాపు రూ.50 నుంచి రూ.60 కోట్ల విలువైన చక్కెర కరిగిపోయిందని తెలిపారు.సరస్వతి చక్కెర కర్మాగారం జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా మాట్లాడుతూ.. 'నిన్న రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి సమయంలో మిల్ ఆవరణలోకి వరద ప్రవేశిస్తోందని సిబ్బంది మమ్మల్ని హెచ్చరించారు. మున్సిపల్ కార్పొరేషన్ డ్రెయిన్ మిల్లు వెనుక నుంచే వెళుతుంది. ఆక్రమణ కారణంగా డ్రెయిన్ మూసుకుపోయి.. వరద నీరంతా మిల్లులోకి చేరింది. చక్కెర అధిక తేమను గ్రహించే స్వభాగం కలిగి ఉండటం వల్ల తీవ్రంగా




నష్టం వాటిల్లింది. దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల విలువైన చక్కెర కరిగిపోయింది. అయితే, నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయలేం. మిల్లు మొత్తం తనిఖీ చేసిన తర్వాత నష్టంపై ఓ అంచనాకు రావొచ్చు. ఇంతకు ముందు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదు' అని తెలిపారు.

## బాలనగర్ ఫ్లైఓవర్‌పై పోలీసులను ఢీకొట్టిన డీసీఎం

బాలానగర్: బాలానగర్ ఫ్లైఓవర్ పై ఓ గుర్తు తెలియని పాదచారుడని కారు ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందారు. ప్రమాద ఘటనను పంచనామా చేస్తున్న ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్ (శిక్షణలో ఉన్న ఎస్ఐ) ఎస్.వెంకటేశంను డీసీఎం ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఎస్ఐ రెండు కాళు విరిగిపోయాయి. అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని యశోద దవాఖానకు తరలించారు. బాలానగర్ పోలీసులు, స్థానికులు కలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 3 .10 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బాలానగర్ ఫ్లైఓవర్ నుంచి కూకట్‌పల్లి వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. బోయిన్‌పల్లి వైపు నుంచి వచ్చిన కారు (%టూ 08ఖజు% 1029) పాదాచారూడిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ప్రయాణికులు బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు. బాలానగర్ ఫ్లైఓవర్ పై జరిగిన ప్రమాదం సంఘటనను పంచనామా చేసేందుకు ప్రొబేషనరీ ఎస్ఐ ఎస్ వెంకటేశం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశంను బోయిన్‌పల్లి వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన డీసీఎం (%టూ 12ఖణ%3937) అతని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని మాదాపూర్ యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రొఫెషనల్ ఎస్సై వెంకటేష్ను బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసిపి నరేష్ రెడ్డి, బాలానగర్ సీఐ నరసింహారాజులు పరామర్శించారు.

ప్రొఫెషనరీ ముగిసింది.. పోస్టింగ్ వచ్చే సమయానికి ప్రమాదం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ వెంకటేశంకు జూన్ 30తో ఆరు నెలల ప్రొబేషనరీ కాలపరిమతి ముగిసింది. జులై నెలలో పోస్టింగ్ రానున్న నేపథ్యంలో ఈ ప్రమాదం సంభవించింది. అతడి పై ఎన్నో ఆశలు పెట్టుకొని వెంకటేశం కుటుంబ సభ్యులకు నిరాశ వచ్చి పడింది. ఇదిలా ఉండగా చికిత్సలో ఉన్న వెంకటేశంకు పోలీస్ ఉన్నతాధికారులు పెదతారా వేచి చూడాల్సిందే.



## సంపాదకీయం

బుధవారం 02-07-2025

# సాగుకు స్టార్టప్‌ల సాయం

వ్యవసాయ రంగం భారత జీడీపీకి 16-18శాతం వాటా అందిస్తోంది. దేశ శ్రామిక బలగంలో 46 శాతానికి ఉపాధి కల్పిస్తోంది. గత ఆరేళ్లలో ఏటా అయిదు శాతం చక్రీయ వృద్ధిరేటు సాధిస్తూ వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సాగురంగానికి స్టార్టప్‌ల తోడ్పాటు కీలకమవుతోంది.ప్రస్తుతం మన వ్యవసాయ రంగం విలువ 58వేల కోట్ల డాలర్ల నుంచి 65వేల కోట్ల డాలర్లుగా ఉంది. ఇది 2035కల్లా 1.4 లక్షల కోట్ల డాలర్లకూ, 2047కల్లా 3.1 లక్షల కోట్ల డాలర్లకు పెరగవచ్చని మెకిన్సే సంస్థ అంచనా. 2018-2022 మధ్య వ్యవసాయ సాంకేతిక (అగ్రిటెక్) స్టార్టప్‌లలో పెట్టుబడులు మూడింతలు పెరిగాయి. ప్రపంచ అగ్రిటెక్ పెట్టుబడుల్లో 15 శాతాన్ని భారతీయ వ్యవసాయ సాంకేతిక స్టార్టప్‌లు ఆకర్షించాయి. నేడు భారతీయ రైతులకు అధునాతన సలహాలు అందిస్తున్న అగ్రిటెక్ స్టార్టప్‌ల సంఖ్య 2800. వీటి సంఖ్య ఇంకా పెరగాలి. భారతీయ వ్యవసాయాన్ని రూపాంతరం చెందించే సత్తా ఉన్న అగ్రిటెక్ స్టార్టప్‌లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు కంపెనీలు, పరిశోధనాలయాలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. హైదరాబాద్ నేడు పలు అగ్రిటెక్ స్టార్టప్‌లకు కేంద్రంగా నిలుస్తూ రెండు తెలుగు రాష్ట్రాలకూ సేవలు అందిస్తోంది.

అగ్రిబిజినెస్, ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాం (ఇక్రిశాట్)

దేశంలో 2003లో ప్రారంభమైన మొట్టమొదటి అగ్రిటెక్ ఇంక్యుబేటర్. ఇది 200కు పైగా స్టార్టప్‌లకు ఊపిరిపోసింది. 194 అధునాతన వ్యవసాయ సాంకేతికతలను వాణిజ్య వినియోగంలోకి తెచ్చింది. 23 స్టార్టప్‌లకు 1.8 కోట్ల డాలర్ల పెట్టుబడులు అందడానికి తోడ్పడింది. 2,300 మందికి పైగా వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చింది. 'భారత్‌లో తయారీ' కింద ఇక్రిశాట్ ఇంక్యుబేషన్ కేంద్రం నుంచి ఉద్భవించిన ఎక్స్‌మెషీన్స్- రైతులకు కలుపు తీయడానికి, నాట్లు వేయడానికి, పురుగు మందులు చల్లడానికీ యంత్రాలను అందిస్తోంది.

న్యూట్రిహబ్ (భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ-ఐఐఎంఆర్)

ఐఐఎంఆర్ ఇంక్యుబేషన్ వేదిక న్యూట్రిహబ్. దేశంలో ఎనిమిదేళ్లుగా చిరుధాన్య విప్లవానికి చోదకశక్తిగా నిలుస్తోంది. 500స్టార్టప్‌లకు జన్మనిచ్చింది. 250 చిరుధాన్య సాంకేతికతలను వాణిజ్య రూపంలోకి మార్చడానికి తోడ్పడింది. చిరుధాన్యాల సాగు, వినియోగాలను పెంచడానికి ఐటీసీ, నెస్లే, పెప్సీ వంటి సంస్థలతో న్యూట్రిహబ్ చేతులు కలిపింది. ఈ సంస్థ చిరుధాన్య సిద్ధాహారాలను తయారుచేసే స్టార్టప్‌లకు చేయూతనిస్తోంది. రైతులను మార్కెట్‌తో అనుసంధానిస్తోంది. 2021లో ప్రారంభమైనప్పటి నుంచి ఇది 124 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసింది. వెంచర్ పెట్టుబడులతో నడిచే 40కి పైగా సంస్థలకు ఊతమిచ్చి, 11 స్టార్టప్‌లలో నేరుగా పెట్టుబడి పెట్టింది. 15కుపైగా మేధా హక్కుల దరఖాస్తులు పెట్టి, 3650మందికి పైగా వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చింది. 10వేల మందికిపైగా రైతులకు సలహాలు సంప్రదింపులు అందించింది. ఈ అగ్రిహబ్ అండదండలతోనే మారుతి డ్రోన్స్ అనే వ్యవసాయ డ్రోన్ల సంస్థ విజయవంతమైంది.

ఎ-ఐడియా (నార్మ్)

భారత వ్యవసాయ పరిశోధన మండలి, హైదరాబాద్‌లోని నేషనల్ అకాడెమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) కలిసి ప్రారంభించిన ఎ-ఐడియా (అసోసియేషన్ ఫర్ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఇన్‌అగ్రికల్చర్) సాంకేతిక వాణిజ్య ఇంక్యుబేటర్. 2014 నుంచి 14 వ్యవసాయ సంబంధ రంగాల్లో 310 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసింది. రూ.139 కోట్లకు పైగా నిధులు సమకూర్చింది. 2,800 స్టార్టప్‌లకు నేరుగా మద్దతు ఇచ్చి పలు ఉద్యోగాలను సృష్టించింది. సాగు రంగంలో వాణిజ్య భావనలు కార్యరూపం దాల్చడంలో క్రియాశీల పాత్ర పోషిస్తోంది.

సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, అగ్రిప్రెన్యూర్‌షిప్

హైదరాబాద్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్(మేనేజ్)కు చెందిన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, అగ్రిప్రెన్యూర్ షిప్(సీఐఏ) జాతీయ స్థాయి ఉత్కృష్ట కేంద్రం. 495 వ్యవసాయ స్టార్టప్‌లకు ఊపిరి పోసింది. 212 సంస్థలకు నిధులు సమకూర్చింది. దేశమంతటా 989 మంది వ్యవస్థాపకులకు సైదోడుగా నిలిచింది.

రిచ్, హైదరాబాద్

రీసెర్చ్, ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(రిచ్) సర్కారుకు, విద్యా సంస్థలు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తోంది. డ్రోన్-ఉపగ్రహ వాణిజ్యీకరణకు ఊపునిస్తోంది. వ్యవసాయ రంగంలో నవీకరణకు ఆటంకం కలిగిస్తున్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి తోడ్పడుతోంది.హైదరాబాద్‌లోని వ్యవసాయ ఇంక్యుబేషన్‌వ్యవస్థ వెయ్యికిపైగా స్టార్టప్‌లకు జన్మనిచ్చింది. ఇక్కడి ఇంక్యుబేషన్ కేంద్రాల నుంచి 30వేల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. పదివేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాల సృష్టి జరిగింది.

ఏపీలో సైతం...

దేశంలో పండ్ల ఉత్పత్తిలో ఏపీ వాటా 15.6శాతం. మామిడి సాగులో రెండో స్థానం. దేశంలో 30శాతం చేపల ఉత్పత్తి, 31శాతం రొయ్యల సాగు ఏపీలోనే జరుగుతోంది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రం 38శాతం వాటా సాధిస్తోంది.

# మన ఆడోళ్లు దాచిన బంగారమంత కాదు పాకిస్తాన్ బతుకు..



న్యూఢిల్లీ,మన ఇళ్లలోని బంగారం విలువ ఎంతో తెలిస్తే ఆశ్చర్య పోతారు. ప్రపంచం మొత్తం దగ్గరున్న బంగారంలో మనదగ్గరున్న శాతమెంతో తెలిస్తే షాకవుతారు. మనదసలు ఉట్టి ఇటుకల ఇల్లు కాదు.. బంగారు ఇల్లు. గోల్డెన్ హోం. అందుకు కారణమేంటి? ప్రపంచ ప్రైవేటు గోల్డ్ ప్రాపర్టీలో మనమెందుకంత ముందంజలో ఉన్నాం. ఆ డీటైల్స్ ఏంటి? ఇప్పుడు చూద్దాం.

భారత్ ఇంటింటి బంగారం

భారతదేశంలో ఇంటింటి బంగారం విలువ పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కంటే ఆరు రెట్లు పెద్దది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల గృహ సంపదకన్నా కొన్ని వందలు వేల రెట్లు ఎక్కువ. దేవాలయాలతో సహా భారతీయ కుటుంబాల సమిష్టి సంపద విలువ 25 వేల టన్నులు. దీని విలువ మార్కెట్లో 2. 4 ట్రిలియన్లుగా అంచనా వేసింది వరల్డ్ గోల్డ్ కౌన్సిల్. ఇది మన 2026 ఫైనాన్షియల్ ఇయర్ లో 56 శాతంగా అంచనా.

2. 4 ట్రిలియన్లు- %ఔ+జ

2025 ఫైనాన్షియల్ ఇయర్ కోసం ఐఎంఎఫ్ ఒక అంచనా వేసింది. దీని ప్రకారం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ 411 బిలియన్ డాలర్ల విలువైంది. అయితే భారతదేశంలోని ప్రైవేటు బంగారు నిల్వల మొత్తం ఎంతని చూస్తే ఇది పాకిస్థాన్ జీడీపీ కంటే ఆరు రెట్లు అధికంగా కనిపిస్తోంది. కేవలం పాకిస్తాన్ మాత్రమే కాదు.. 2. 4 ట్రిలియన్ డాలర్ల ఇటలీ, 2. 3 డాల్ల కెనడా జీడీకన్నా ఎక్కువే.

2026 నాటికి ఔన్సు ధర 3500 డా. కి పెరుగుదల

యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ ప్రకారం.. 2020 నాటి కాలం నుంచి బంగారం ధరలు ఎక్కువయ్యాయి. ఇది భారతీయ గృహ సంపదను మరింత పెంచినట్టు తెలుస్తోంది. వాణిజ్య ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, రాజకీయ పరిణామాలు, ఇంకా ఎన్నో అనిశ్చితుల కారణంగా 2026 నాటికి బంగారం ధరలు ఔన్సుకు 3500 డాలర్లకు పెరుగుతాయని అంచనా వేసింది స్విస్ బ్యాంక్. 2026 ఆర్థిక సంవత్సరానికిగానూ.. భారత్ లో బంగారం పరిమాణం విషయంలో డిమాండ్ తగ్గుతుందని.. యూబీఎస్ అంచనా వేసినప్పటికీ.. అధిక ధరలు నికర దిగుమతులను 55- 60 బిలియన్ డాలర్లకు చేర్చుతాయని తెలుస్తోంది. ఇది జీడీపీలో 1. 2 శాతంగా ఉండటం విశేషం.

ఇది గతం కంటే 15 శాతం ఎక్కువ

ప్రజెంట్ గోల్డ్ రేట్స్ రికార్డులు తిరగరాస్తున్నాయి. అయినా సరే ప్రస్తుతం బంగారం డిమాండ్ ఏమంత తగ్గలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర డిమాండ్ 782 టన్నులు కాగా.. ఇది గతం కంటే 15 శాతం ఎక్కువ. ఆభరణాల డిమాండ్ అయితే కాస్త తగ్గిన మాట నిజం. బంగారు కడ్డీలు, నాణేలలో రిటైల్ ఇన్వెస్ట్ మెంట్ 25 శాతం పెరుగుదల కనిపిస్తోంది. 2024 మధ్య కాలంలో కస్టమ్స్ సుంకం 15 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గింది.

2027 నాటికి ఈ డిమాండ్ 800 టన్నులకు డిమాండ్

2026 నాటికి హౌస్ హోల్డ్ డిమాండ్.. 725 టన్నులకు తగ్గుతుంది. 2027 నాటికి ఈ డిమాండ్ 800 టన్నులకు పెరుగుతుందని అంచనా వేస్తోంది యూబీఎస్. ఈ రికవరీ వెనక కేంద్ర వేతన పెరుగుదల ఉండొచ్చని అంటున్నారు. ఈ మొత్తం విలువ 55 బిలియన్ డాలర్లు. ఇది పొదుపును పెంచుతుంది. దీంతో ఇటు రియల్ ఎస్టేట్ అటు గోల్డ్ ఇన్వెస్ట్ మెంట్ లో పెట్టుబడులు పెరిగే అవకాశం ఏర్పడుతుంది. అందుకే 2027 నాటికి బంగారం కొనుగోళ్లు పెరుగుతాయని అంటోంది స్విస్ బ్యాంక్.

మనం తాకట్టు పెడుతోన్న బంగారం 2 శాతం మాత్రమే

భారత్ బంగారు నిల్వలు ఆకట్టుకునేలా ఉన్నప్పటికీ ఈ సంపద ద్వారా మనీ జనరేట్ చేసే యత్నాలు చాలా వరకూ తగ్గాయి. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ విభాగంలో విస్తరించడానికి ప్రయత్నించినప్పటికీ.. గృహ బంగారంలో 2 శాతంకన్నా తక్కువ రుణాలకు పూచీకత్తుగా వాడుతున్నట్టు చెబుతోంది స్విస్ బ్యాంక్. బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, చోళ వంటి సంస్థలు గోల్డ్ లోన్స్ ఇస్తున్నాయి. అయితే బంగారు ఆభరణాల పై ఉన్న మోజు.. గోల్డ్ బాండ్స్, గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్స్ ని దెబ్బ తీసినట్టుగా చెబుతారు. అందుకు 2024లో సావరిన్ బాండ్స్ నిలిపివేతే అతి పెద్ద ఉదాహరణగా చెబుతోంది స్విస్ బ్యాంక్. బంగారం ధర ఎప్పుడైతే పెరుగుతూ వెళ్తుందో.. ఇది ప్రభుత్వానికి భారమయ్యే అవకాశముంది. అందుకే ఇలా చేసినట్టు చెబుతున్నారు నిపుణులు. బంగారం దిగుమతి భారం ఎక్కువగా ఉన్నప్పటికీ.. భారత్ కరెంటు ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉన్నట్టు తెలుస్తోంది.

ప్రపంచ ప్రైవేటు బంగారు నిల్వలో 14 శాతం భారత్ లో

ప్రపంచంలోని ప్రైవేటు బంగారు నిల్వలో 14 శాతం భారత్ లోనే ఉంది. ఇది అతి పెద్ద ప్రైవేట్ గోల్డ్ ప్రాపర్టీగా భావిస్తున్నారు. స్విస్ బ్యాంక్ చెప్పినట్టు బంగారంతో భారతీయ కుటుంబాలకు అతి పెద్ద ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది. ఇక్కడ ఎంత బంగారముంటే అంత గొప్ప. సరిగ్గా అదే సమయంలో వారినీ అలవాటు సంపన్నులుగా మార్చుతోంది. బంగారం అంటే లక్ష్మీదేవితో సమానమని.. బంగారు నిల్వలు ఎంతగా ఉంటే తమ చెంత అంతటి లక్ష్మీకటాక్షం ఉన్నట్టు భావిస్తారు కాబట్టి.. భారతీయ కుటుంబాలకూ బంగారానికీ ఒక విడదీయరాని అనుబంధంగా మారింది పరిస్థితి.

భారత్‌లో బంగారం అదో ఎమోషన్

మన ప్రాంతంలో నీ ఇల్లు బంగారం కాను.. అంటారు. కారణం.. ఇక్కడ బంగారమంటే అదో ఎమోషన్. ప్రతిదానికీ బంగారం లాంటి మనిషి, బంగారు కొండ.. ఇలా రకరకాల విశేషణాలు అల్లుకుని కనిపిస్తాయి. సరిగ్గా అదే సమయంలో.. ఇక్కడ బంగారానికి దేవతా ఆచ్ఛాదన కూడా ఉండటంతో.. ఇక్కడ గోల్డ్ మీన్స్ గాడ్ కింద లెక్క.

బంగారు నిల్వ చేయడం భారత్ సంప్రదాయం

గోల్డ్ ఇన్వెస్ట్ మెంటే కాదు- సెంటిమెంటు కూడా..భారతదేశానికి బంగారానికి ఉన్న అనుబంధం.. మాటల్లో వర్ణించలేనిది. ఇక్కడ స్వర్ణంగా పిలిచే బంగారం నిల్వ చేయడం ఒక సంప్రదాయం. మరీ ముఖ్యంగా ఆడపిల్లలను బంగారు ఆభరణాలతో ముంచెత్తాలని అనుకుంటారు. అంతే కాదు ఎవరికి ఎంత బంగారముంటే వారికి అంతటి సామాజిక గౌరవం విలువ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఏదైనా పెళ్లి పేరంటాలపుడు ఇక్కడి మహిళలు బంగారు ఆభరణాలను ధరించడం ద్వారా తమ హోదాను ప్రదర్శిస్తుంటారు.

బంగారం ఒక శుభప్రదంగా భావన

మరీ ముఖ్యంగా హిందూ సంప్రదాయంలో బంగారం ఒక శుభ ప్రదమైన భావన. ఇక్కడ ఏదైనా సరే బంగారంతో ఉంటే దాన్నొక దైవంగా భావిస్తుంటారు. ఆ మాటకొస్తే మన ఇళ్లు వాకిళ్లూ ఇంకా దేవాలయాలు ఇలా అన్నింటా బంగారం ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉంటుంది.

బంగారు వాకిలి, బంగారు కిరీటాలు, గోపురాలు, రథాలు..

బంగారు వాకిలి అంటూ మన ఆలయ వ్యవస్థలో బంగారం అతి పెద్ద పాత్ర పోషిస్తూ ఉంటుంది. ఇక బంగారు కిరీటాలు, గోపురాలు, రథాలు అంటూ బంగారం వాడకం విలువ అధికంగా కనిపిస్తుంది. అంటే ఆయా దేవీ దేవతలు సైతం.. ఎంత ప్రముఖమైన వారో తెలియ చేసేది ఈ బంగారమే. ఆ మాటకొస్తే గోల్డెన్ టెంపుల్ కల్చర్ భారత ఆధ్యాత్మిక విభాగంలో ఒక భాగం.

# స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల సమస్య !

హైదరాబాద్,స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టు లైన్ క్లీయర్ చేయడంతో పాటు, డెడ్‌లైన్ కూడా విధించింది. మరోవైపు 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేసే ఎన్నికలు నిర్వహించాలని బిఆర్‌ఎస్, బిజెపి డిమాండ్ చేస్తున్నాయి. కులగణన చేసి చరిత్ర సృష్టించామని, మోడీకి సవాల్ విసిరామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసి రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. స్థానిక ఎన్నికల్లో ఎలా అమలు చేస్తారన్నదానికి అసలు ప్రణాళిక ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కేంద్రం దీనికి ఆమోదం తెలిపితేనే ముందుకు సాగం సాధ్యం అవుతుంది. ఎన్నికలను 3 నెలల్‌ఓగా పూర్తి చేయాలని హైకోర్టు గడువు విధించడంతో బీసీ రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర సర్కారు కసరత్తు చేయాల్సి ఉంది. ఎలా చేస్తే అడుగు ముందుకు పడుతుందో ఇప్పుడు సవాల్ కానుంది. కేంద్రాన్ని తిడుతూ పోతే సమస్య పరిష్కారం కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఉభయ సభల్లో ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం ఇప్పటికే పంపించింది. ప్రస్తుతం ఈ రెండు బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఆమోదింప చేయాలని ఢిల్లీలో ధర్నా కూడా నిర్వహించారు. కిషన్‌రెడ్డి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అయితే బిసి కులగణన అంతా తప్పుల తడకగా ఉందని బిజెపి వాదిస్తోంది. మరోవైపు కేంద్రం చేసే గణనకే చట్టబద్దత ఉంటుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చి న హామీ మేరకు లేదా పదేపదే ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వమే 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశాన్ని ఎలా అమలు చేస్తారన్నది చూడాలి. ప్రస్తుతం ఎస్సీలకు 18, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తే మొత్తం రిజర్వేషన్లు 70 శాతం చేరే అవకాశం ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించరాదని ఇప్పటికే సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అందువల్ల ప్రభుత్వ నిర్ణయాన్ని ఎవరైనా కోర్టుల్లో సవాల్ చేస్తే మొత్తం ఎన్నికల పక్రియ నిలిచిపోయే ప్రమాదం ఉన్నది. అలాంటప్పుడు కేంద్రం అంగీకరించకుండా 42శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదు. అది కాకుంటే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కూడా సాధ్యం కావు. అందువల్ల పార్టీ పరంగా 42శాతం బిసి రిజర్వేషన్లు ఇస్తామనే ప్రకటన చేయడం మినహా మరోమార్గం లేదు. బిసి రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా తమిళనాడుకు కల్పించినట్లే తమకు రక్షణ కల్పించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నది. కానీ కేంద్రం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు ఎట్టి పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం మించరాదనే సుప్రీంకోర్టు తీర్పు ఉన్నది. దీంతో కోర్టు తీర్పులు, రాజ్యాంగ నిబంధనలులాంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును గత మార్చిలోనే అసెంబ్లీ అమోదించింది. కానీ బీసీ రిజర్వేషన్ల పెంపు రాష్ట్ర పరిధిలో తీసుకునే నిర్ణయం కాకపోవడంతో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ప్రస్తుతం ఇది రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిపై ఇప్పటివరకూ రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ



విషయంలో న్యాయ నిపుణులను సంప్రదించి, ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తేవడంపైనా ప్రభుత్వం ఆలోచించాల్సి ఉంది. అయితే రాజ్యాంగ పరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తరవాతే రాష్ట్రపతి ఆఓదం తెలుపుతారు. కాబట్టి ఇలాంటి విషయాల్లో రాష్ట్రపతి కూడా న్యాయ సలహాకు పంపుతారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే జీవో ఇవ్వడం సాధ్యమువుతందా అన్న విషయం కూడా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఇలా చేయడం వల్ల వచ్చే న్యాయపరమైన చిక్కులపైనా ప్రభుత్వం ఆరా తీస్తున్నది. నిజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో అంటే ఈ మూడు నెలల్లో కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రాకపోవచ్చు. అందువల్ల పార్టీపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి.. ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమం. మరోవైపు హైకోర్టు తీర్పు తరవాత పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే హైకోర్టు తీర్పు తర్వాత సీఎస్ రామకృష్ణారావును పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులోని అంశాలను వివరించారు. రిజర్వేషన్లపై క్లారిటీ వస్తే.. వెంటనే ఎన్నికల పక్రియ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి సీఎస్ రామకృష్ణారావు వివరించినట్లు తెలిసింది. రిజర్వేషన్ల బిల్లుపై రాష్ట్రపతి నుంచి ఎలాంటి ఆమోదం రాకుంటే తమిళనాడు తరహాలో సుప్రీంకోర్టు మెట్లెక్కాలని కొందరు సూచించినట్లు సమాచారం. మరోవైపు తెలంగాణలో కులగణన, ఇక్కడి నుంచి వెళ్లిన రిజర్వేషన్ల బిల్లులపై కేంద్రం పెద్దగా స్పందించడం లేదు. సానుకూలతనూ వ్యక్తం చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే కేంద్రం జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం లభిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. సమగ్ర కులగణన సర్వే వివరాలు, అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు ఆధారంగా నేరుగా బీసీలకు నేరుగా 42 శాతం రిజర్వేషన్లను ప్రకటిస్తే వచ్చే న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో.. ప్రభుత్వం ఏం చేస్తుందన్న చర్చ సాగుతోంది. ఓ రకంగా ఇది అంత సులవైన విషయం కాదు. ప్రభుత్వ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది.

# మున్సిపల్ శాఖలో 3వేల కోట్లు పక్కదారి

నెల్లూరు, గత వైకాపా ప్రభుత్వం మున్సిపల్ శాఖకు చెందిన రూ.3 వేల కోట్లను పక్కదారి పట్టించిందని మంత్రి నారాయణ విమర్శించారు. రాష్ట్రంలో డ్రెయిన్ల పనులన్నీ త్వరలో పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పారు. నెల్లూరు నగరం 45వ డివిజన్ పొగతోటలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నెల్లూరులోని 6.7 కిలోమీటర్ల పరిధిలోని కాలువలన్నింటిలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 15 రోజుల్లో పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. రూ.పది లక్షల కోట్ల అప్పు రాష్ట్రానికి మిగిల్చి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు (అరజీనిటసజీశిజీశిబీ) అనుభవంతో పరిస్థితులు గాడిన పడుతున్నాయి. వైకాపా ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద పిల్లల కోసం సిద్ధమైన వీఆర్ హైస్కూల్‌లో ఈరోజు నుంచి తరగతులు ప్రారంభిస్తున్నామని నారాయణ తెలిపారు.

# రైతులందరికీ కిసాన్ పథకం

న్యూఢిల్లీ, దేశంలో 90 కోట్లకు మించి రైతు కుటుంబాలు వున్నట్లుగా ఓ అంచనా ఉంది. ప్రధాని కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు సమాన వాయిదాల్లో రూ. 6000 నగదు ఇచ్చే పథకం అమలు చేస్తున్నారు. అయితే కేవలం 10.74 కోట్ల కుటుంబాలకే ఇది అందుతున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేవలం 10 శాతం రైతు కుటుంబాలే ఈ కనీస లబ్దిని పొందుతున్నాయి. 2016లో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం పరిమిత సంఖ్యలోని రైతులకే వర్తిస్తున్నది. రైతుల కోసం ఉద్దేశించిన 17 పథకాలకు 202021 ఆర్థిక సంవత్సరంలో రూ. 17,540 కోట్లు కేటాయించగా, అందులో రూ. 5,787 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే మొత్తం బడ్జెట్ కేటాయింపులో 33శాతం మాత్రమే ఖర్చు అయింది. ఇందులో మూడు పథకాల కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని సమాచారం. రైతు సంక్షేమం కోసం ఆచరణలో ఇంత తక్కువ స్థాయి కృషి జరుగుతున్నప్పుడు వారి ఆదాయం ఏ విధంగా రెట్టింపు అవుతుందో అర్థం కాని విషయం. 2019లో దేశ వ్యాప్తంగా కనీసం 5,957 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రోజుకి సగటున 16 మంది రైతులు ప్రాణత్యాగం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2014 నుంచి 2020 వరకు గల ఆరు సంవత్సరాల్లో రైతు ఆత్మహత్యలు అత్యధికంగా జరిగినట్టు వెల్లడైంది.దీనిపై కారాణాలు వెతికి ఆత్మహత్యలను నిర్మూలించే చర్యలకు ఉపక్రమించడం లేదు. దీంతో వ్యవసాయంలో కాలం కలసిరాకనో..పంటలు పండినా మద్దతుధరలు లేకనో..చేసిన అప్పులు తీర్చలేక రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీటిపై తక్షణం దృష్టి సారించాల్సి ఉంది.

# భారీ ఊరట..

అమెరికా,అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు ఇది నిజంగా ఒక శుభవార్త! అమెరికా సెనెట్ తాజాగా ప్రతిపాదించిన ముసాయిదా ప్రకారం.. రిమిటెన్స్ ట్రాన్స్‌ఫర్ టాక్స్‌ను గణనీయంగా తగ్గించారు. ఇదివరకు ఉన్న 3.5 శాతం నుండి కేవలం 1 శాతానికి ఈ పన్నును తగ్గించడం ద్వారా భారతదేశానికి నిత్యం డబ్బులు పంపే ఎన్‌ఆర్‌ఐలకు భారీ ఊరట లభించనుంది.

ట్రంప్ బిల్‌లో కీలక మార్పులు

ఈ ముఖ్యమైన సవరణలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన "వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్" ముసాయిదాలో భాగంగా తీసుకొచ్చారు. తొలుత హౌస్‌లో 5 శాతం రేటును ప్రతిపాదించగా.. తరువాతి దశలో దానిని 3.5 శాతానికి తగ్గించారు. ఇప్పుడు సెనెట్ విడుదల చేసిన ముసాయిదాలో ఈ పన్ను రేటును ఏకంగా 1 శాతానికి తగ్గించడం విశేషం.

ఈ టాక్స్ ఎవరికి వర్తిస్తుంది?

గ్రాంట్ థార్న్టన్ భారత్‌లో యుఎస్ టాక్స్ పార్ట్‌నర్ అయిన లాయిడ్ పింటో వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ టాక్స్ డబ్బు పంపకాల్లో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వర్తిస్తుంది. అవి ఏంటంటే..క్యాష్ ద్వారా పంపిన ట్రాన్స్‌ఫర్‌లకు అంటే, నగదు రూపంలో చేసే బదిలీలకు వర్తిస్తుంది.. మనీ ఆర్డర్, క్యాషియర్ చెక్ లేదా ఇతర ఫిజికల్ పేమెంట్ టూల్స్ ద్వారా పంపే పంపకాలకు ఇది వర్తిస్తుంది. భౌతికంగా చేసే చెల్లింపు సాధనాల ద్వారా జరిగే లావాదేవీలకు మాత్రమే ఈ టాక్స్ వర్తిస్తుంది.అయితే ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే.. అమెరికాలోని బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల ఖాతాల్లో ఉన్న డబ్బుల ద్వారా జరిపే ట్రాన్స్‌ఫర్లు, లేదా అమెరికా జారీ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే ట్రాన్స్‌ఫర్లు ఈ టాక్స్‌కు లోబడి ఉండవు.

ఎప్పుడు అమల్లోకి వస్తుంది?

ఈ కొత్త రిమిటెన్స్ టాక్స్ నిబంధనలు 2025 డిసెంబరు 31 తర్వాత అమలులోకి వస్తాయి. ఈలోగా సెనెట్ ఈ బిల్లును జూలై 4వ తేదీలోగా ఆమోదించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఎన్‌ఆర్‌ఐలకు గొప్ప ఊరట

ఈ నూతన ముసాయిదా ప్రవాస భారతీయులకు ఎంతగానో ఉపశమనంగా మారనుంది. ఎందుకంటే వారు తమ కుటుంబ సభ్యులకు డబ్బు పంపేటప్పుడు బ్యాంకు ఖాతాలు లేదా కార్డులు ఉపయోగిస్తే టాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది ముఖ్యంగా చిన్న మొత్తాలను తరచుగా పంపేవారికి.. అధిక సంఖ్యలో ఎన్‌ఆర్‌ఐలకు భారీ ఉపశమనాన్ని కలిగిస్తుంది. అమెరికాలో ఎన్‌ఆర్‌ఐలు ఎక్కువగా డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారానే డబ్బు పంపడం వల్ల, ఇది వారందరికీ నిజంగా ఒక పెద్ద రిలీఫ్ అని చెప్పొచ్చు.ఈ బిల్లు ఆమోదంతో ప్రవాస భారతీయులు తమ కష్టార్జితాన్ని స్వదేశానికి మరింత సులభంగా.. తక్కువ పన్ను భారంతో పంపగలుగుతారు.

# టెంపో ట్రావెల్‌ను ఢీకొన్న లారీ..ముగ్గురు దుర్మరణం

చిత్తూరు,అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం దొమ్మన్న బావి వద్ద టెంపో ట్రావెల్ ను లారీ ఢీకొట్టింది. తిరుమల నుంచి కర్ణాటక బాగేపల్లి వెళ్తున్న టెంపో ట్రావెల్ ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, 9 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతి చెందిన వారు చరణ్, మేఘర్ష్, శ్రావణి గా గుర్తించారు. డ్రైవర్ మంజునాథ్ తో సహా మరో 8 మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదఘటన పై ముదివేడు పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

విజయవాడ, వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడులను మూడు రోజులపాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఏసీబీ కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే తమకు ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును సిట్ కోరింది. కానీ వీరిని విచారించేందుకు మూడు రోజుల కస్టడీకి మాత్రమే అనుమతి ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దీంతో జులై 1 నుంచి 3వ తేదీ వరకు వీరిద్దరిని సిట్ అధికారులు విచారించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు వీరిని విచారించాలని ఆ ఆదేశాల్లో న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు ఇదే లిక్కర్ స్కామ్‌లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అతడు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ లిక్కర్ స్కామ్ కేసులో ఏ 39గా మోహిత్ రెడ్డి ఉన్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు జైలు ప్రాంగణంలోని ఆలయానికి ప్రతి రోజు 10 నిమిషాలు వెళ్లేందుకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. అయితే జైల్లో ఉన్న తనకు బయట ఆహారం పంపాలంటూ చెవిరెడ్డి చేసుకున్న అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అలాగే వారంలో మూడు సార్లు ములాఖత్‌లకు చెవిరెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

# జెసి ప్రభాకర్ రెడ్డి గుండా రాజకీయం

అనంతపురం, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై జిల్లా ఎస్పీకి వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి ఇచ్చినా తాడిపత్రి లోకి రానీయడం లేదంటూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను తాడిపత్రి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని.. తగిన భద్రత కల్పించాలని రెండు మాసాల కిందటే హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలను రపా.. రపా.. నరుకుతాంటూ జేసీ బెదిరిస్తున్నారని... తనకు మద్దతుగా నిలిచిన వారిపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్.. ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా జేసీపై ఎస్పీ జగదీష్‌కు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. హింసకు పాల్పడుతున్న టీడీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ముందిమాపు రాజకీయాలు చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాడిపత్రిలో ప్రశాంత వాతావరణం ఉండేదన్నారు. ఆఎ÷-టాల్ మున్సిపల్ చైర్మన్ జేసీ చెబితే పోలీసులు నడుచుకోవటం హాస్యాస్పదమన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలపై జేసీ ప్రభాకర్ రెడ్డితో బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సవాల్ విసిరారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు దుర్మార్గమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఆ కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని.. కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి నియోజకవర్గంలోకి వెంటనే అనుమతించాలని డిమాండ్ చేశారు. తాడిపత్రి లో నియంత పాలన జరుగుతోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఆంక్షలు ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు.

స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు

## పూర్ణచందర్ అమాయకుడని భార్య స్వప్న వ్యాఖ్యలు

హైదరాబాద్, ప్రముఖ టీవీ చానల్ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నిందితుడు పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడని స్వప్న సంచలన వ్యాఖ్యలు చేశారు.పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందన్నారు. అయితే, వారిద్దరి మధ్య సంబంధం గురించి ముందు తనకు తెలియదన్నారు. వారిద్దరి వ్యవహారం తెలిశాక పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు.పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు అరణ్య చేస్తున్న ఆరోపణలు అసత్యమని, అరణ్యను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని భయపెట్టిందని స్వప్న వివరించారు. ఞగా, స్వేచ్ఛ వోటార్కర్ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్‌ను పోలీసులు నిన్న అరెస్ట్ చేశారు. అతడి వేధింపుల కారణంగానే తమ కూతురు మరణించినట్టు చిక్కడపల్లి పోలీసులకు స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ నేపథ్యంలోనే నిందితుడు పూర్ణచందర్ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వేచ్ఛ, నేను స్నేహితులుగా ఉండేవాళ్లం. ఐదేళ్లుగా ఆమె మానసికంగా ఆందోళన చెందుతూ చికిత్స పొందుతుంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. స్వేచ్ఛ ఆత్మహత్యతో నాకు ఏలాంటి సంబంధం లేదని లేఖలో పూర్ణచందర్ పేర్కొన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలు దురదృష్టకరం

హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్ట్‌ల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. 'ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసేది' అంట్యూ÷ర్ అయ్యారు.శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్÷ర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎ ల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను సోమవారంకాంగ్రెస్ నేతలు పరిశీలించారు.

# పవన్‌పై కట్టప్ప తిరుగుబాటు.. సత్యరాజ్ కామెంట్లకు అర్థమేంటి?



హైదరాబాద్,పవన్ కళ్యాణ్ వర్సెస్ కట్టప్ప సత్యరాజ్. పవన్ సినిమాలో ఒక పక్క నటిస్తూ.. అదే సమయంలో పవన్‌ని ఇంతగా ద్వేషించడం వెనక కారణాలేంటి? తెలుగులో వరుస సినిమాలు చేస్తూ వస్తున్న సత్యరాజ్ మెగా హీరోల్లో ప్రముఖుడు, రాజకీయ నాయకుడు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి అయిన పవన్‌పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడంలో రీజనేంటి? అసలేంటీ పవనిజం వర్సెస్ కట్టప్ప ఇజం? ఇప్పుడు చూద్దాం.

తెలుగు నాట ఎన్టీఆర్, ఇప్పుడు డిప్యూటీ సీఎంగా పవన్

సత్యరాజ్ అతి పెద్ద పెరియార్ ఫాలోయర్తమిళనాట సినిమాల నుంచి సీఎం అయిన ఎంజీఆర్, తెలుగు నాట ఎన్టీఆర్, ఆ తర్వాత డిప్యూటీ సీఎం అయిన పవన్ కళ్యాణ్ అంటూ.. పవన్ కళ్యాణ్ గురించి గొప్పగా చెప్పారు సత్యరాజ్. హరిహర వీరమల్లులో ఒక పాత్ర పోషిస్తున్న ఆయన.. పవన్ రాజకీయంగా ఇంత పెద్ద స్థాయికి చేరడం తనకు ఎంతగానో సంతోషంగా ఉందంటూ.. కామెంట్ చేశారు కట్టప్పగా తెలుగులో సుపరిచితులైన సత్యరాజ్.

ఉన్నట్టుండి పవన్‌తో రివర్స్ అయిన సత్యరాజ్

అంతా బాగుందనుకుంటున్న తరుణంలో.. సత్యరాజ్ ఉన్నట్టుండి పవన్‌పై రివర్స్ అయ్యారు. ఇందుకు కారణం.. తమిళనాట మురుగన్ మానాడు అని పెట్టిన ఒక సభకు పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. అక్కడ తమిళ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

మేం పెరియార్ సిద్ధాంతాలు నమ్మే వారం-సత్యరాజ్

ఇదొక ఆధ్యాత్మిక సభ. దీన్నందరూ పాజిటివ్‌గా తీస్కుంటారనుకుంటే పవన్ తో కలసి ఇటీవలే ఒక సినిమాలో నటించిన సత్యరాజ్ సడెన్ గా ఈ వ్యవహారంలోకి ఎంట్రీ ఇచ్చి సంచలన కామెంట్ చేశారు. %ఎజఖ% అనే పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. మతం పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తే ఇక్కడ కుదరదని అన్నారు. పెరియార్ సిద్ధాంతాలు నమ్మే మమ్మల్ని ఎవరూ మోసం చేసయలేరని అన్నారు. మీరు పాల్గొన్న సభతో మమ్మల్ని మోసం చేశారనుకుంటే అది తెలివి తక్కువ తనమే అవుతుందని.. తమిళ ప్రజలు ఎంతో తెలివైన వారనీ.. మీ ఆటలు ఇక్కడ సాగవంటూ పవన్ కళ్యాణ్ ని ఉద్దేశించి అన్నారు సత్యరాజ్. దేవుడి పేరిట తమిళనాడులో రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దీంతో ఒక్కసారిగా సత్య రాజ్ వైపు అందరి దృష్టి మరలింది.

అధికార డీఎంకేపై విమర్శలు చేసిన పవన్

సత్యరాజ్ ఇంతగా రియాక్ట్ కావడానికి గల కారణం.. పవన్ అధికార డీఎంకే పార్టీపై విమర్శలు చేయడం. నాస్తికులు దేవుడ్ని నమ్మాల్సిన అవసరం లేదనీ. అయితే మన దేశంలో నాస్తికులు హిందువులను ఎంపిక చేసుకుని టార్గెట్ చేస్తుంటారని అనడంతో.. ఈ మొత్తం వివాదం మొదలైనట్టు తెలుస్తోంది.

పవన్ ని పొగిడిన నోటితోనే సత్యరాజ్ విమర్శలు

మొన్నటి వరకూ పవన్‌తో ఎంతో బాగా సఖ్యంగా ఉన్న సత్యరాజ్ ఇంత సడెన్‌గా రివర్స్ కావడానికి గల కారణమేంటి? ఒక సినిమా స్టార్ రాజకీయంగా ఇంత పెద్ద స్థాయికి చేరడాన్ని చూసి సంతోషంగా ఉందన్న నోటితోనే ఇలా తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడమేంటి? రాజకీయంగా ఆయన బీజేపీలాంటి జాతీయ పార్టీతో పొత్తులో ఉన్నారు. దీంతో దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో ఆ పార్టీ ప్రచారాలకు రావడం అన్నదొక భాగం. దాన్ని ఇంత సీరియస్‌గా తీసుకోవడమేంటన్నది చర్చనీయాంశంగా మారింది.

మిర్చి, శంఖం, బాహుబలి వంటి తెలుగు మూవీస్ చేసిన సత్యరాజ్

సత్యరాజ్ తన సెకండ్ ఇన్నింగ్స్ లో.. మిర్చి నుంచి మొదలు పెడితే శంఖం, ఎన్నో తెలుగు సినిమాల్లో నటించారు. అంతే కాదు, ఆయన బాహుబలిలో కట్టప్ప ద్వారా పాన్ ఇండియా లెవల్లో పాపులర్ అయ్యారు కూడా. అంతేనా ఆయన ప్రస్తుతం చెబుతున్న పెరియార్ అనే బయోపిక్ లోనూ నటించారు.

బాహుబలితో పాన్ ఇండియా లెవల్లో పాపులర్

ఒక రకంగా చెబితే సత్యరాజ్ ఇన్ని సినిమాలు చేయడం వేరు బాహుబలి చేయడం వేరు. అప్పటి వరకూ సౌత్ మూవీ ఆర్టిస్టుగానే పరిచయమున్న సత్యరాజ్ బాహుబలితో పాన్ ఇండియా లెవల్లో పాపులర్ చేసింది తెలుగు సినిమా. అంతే కాదు తమిళంతో పాటు తెలుగులోనూ ఆయన తరచుగా చేస్తూ వస్తున్నారు. ఆ మాటకొస్తే ఆయన తాజా తెలుగు చిత్రం పవన్ నటించిన హరిహర వీరమల్లు.

మెగా హీరోల మార్కెట్ వందల కోట్లలో ఉంటాయ్

దానికి తోడు పవన్ కళ్యాణ్ తో పెట్టుకోవడం అంటే సత్యరాజ్ ఒక మెగా హీరోస్ కాంపౌండ్‌తో పెట్టుకోవడమే. ఆయన గతంలో మెగా కాంపౌండ్ హీరో సాయి ధరమ్ తేజ్ మూవీ ప్రతిరోజూ పండగే అనే చిత్రంలో నటించారు కూడా. ఒక పక్క మెగా హీరోలతో యాక్ట్ చేస్తూ మరో పక్క మెగా హీరోల్లోనే రాజకీయంగానూ కీ రోల్ ప్లే చేస్తున్న పవన్ ని ఇంత ఘాటుగా విమర్శించడం అంటే తన మార్కెట్‌ని తనే కోల్పోవడం అన్నది జనసైనికుల మాట. అందుకే పవన్‌తో పెట్టుకున్న వాళ్లు ఇప్పటి వరకూ బతికి బాగు పడ్డట్టు చరిత్రలో లేదంటూ.. సోషల్ మీడియా పోస్టులతో సత్యరాజ్‌ని మాస్ ర్యాగింగ్ చేస్తున్నారు.

పవన్ డీఎంకేని అనడంతో రియాక్టైన సత్యరాజ్?

ఒక రకంగా చెబితే సత్యరాజ్ చేసింది సాహసమే అంటున్నారు కొందరు. ఎందుకంటే చిరంజీవి దగ్గర నుంచి పవన్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్ వంటి మెగా హీరోల సినిమాలు ఏటా ఏదో ఒకటి రిలీజ్ అవుతూనే ఉంటాయి. వీటి మార్కెట్ విలువ కొన్ని వందల కోట్ల రూపాయల మేర ఉంటుంది. అలాంటి మార్కెట్ గల హీరోలతో సినిమాలు ఒక పక్క చేస్తూ సత్యరాజ్ ఇలాంటి కామెంట్లు చేయడం వెనక గల కారణమేంటన్నదొక చర్చ. అయితే ఈ ఏడాది జనవరిలో సత్యరాజ్ కుమార్తె దివ్య డీఎంకేలో అధికారికంగా చేరారు. దీంతో ఆయన డీఎంకేకి వ్యతిరేకంగా పవన్ చేసిన కామెంట్లకు రియాక్టయ్యారని అంటారు. అందుకే ఆయన తన సినిమా మార్కెట్‌ని కూడా లెక్క చేయక ఈ కామెంట్లు చేసినట్టుగా భావిస్తున్నారు.

సత్యరాజ్ అతి పెద్ద పెరియార్ ఫాలోయర్

తమిళనాడులో ప్రతి హీరోకి ఒక పార్టీ ఉంటుంది. ఇక్కడ సినిమా రాజకీయం జోడు గుర్రాలు. ఇది ఎంజీఆర్ నుంచి కరుణ, జయలలితతో ఆగలేదు. ఇక్కడ రామరాజ్, కార్తీక్, నెపోలియన్ ఇలా ఎందరో తమిళ కథానాయకులు అయితే ఒక పార్టీ పెట్టడం లేదంటే ఏదైనా ప్రముఖ పార్టీలో చేరడం షరా మామూలు. అలా చూస్తే సత్యరాజ్ మొన్నటి వరకూ కూడా కేవలం సినిమాలే చేస్తూ వచ్చారు. తన కుమార్తె ఎప్పుడైతే డీఎంకే తీర్థం పుచ్చుకున్నారో.. అప్పటి నుంచీ ఆయన పొలిటికల్ కామెంట్లు చేయడం స్టార్ట్ చేశారని అంటారు. దానికి తోడు ఆయన పెరియార్ సినిమా చేయడం మాత్రమే కాకుండా ఆయన ఫాలోయర్ కూడా కావడంతో.. ఇదిగో ఇదీ పరిస్థితి.

త్యరాజ్ చేసిన కామెంట్లకు అర్ధమేంటి?

తమిళనాడు రాజకీయాలను ఈ ద్రవిడ వాదం ఎందుకంత ప్రభావితం చేస్తుంది? దీనంతటికీ కారణం ఏమై ఉంటుంది? పెరియార్ ద్రవిడ వాదం అంటే ఏమిటి? సత్యరాజ్ చేసిన కామెంట్లకు అర్ధమేంటి? అసలీ ద్రవిడ వాదం ఎప్పటి నుంచీ మొదలైంది? దీని కొనసాగింపు ఎలాంటిది?

ద్రవిడ వాదానికి పెట్టింది పేరు పెరియార్

ముందరకాళ్ల బంధంగా ముందే పవన్ కట్టడితమిళనాడులో.. ద్రవిడ వాదానికి పెట్టింది పేరు పెరియార్. ఇక్కడ ఏదైనా పార్టీ పెట్టాలంటే అందులో ద్రవిడ పదం తప్పనిసరి. అక్కడ ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ పేరు . అంటే ద్రవిడ మున్నేట్ర కళగం అని అర్థం. జయలలిత సీఎంగా అంతకు ముందు ఎంజీఆర్ ముఖ్యమంత్రిగా ఎదిగిన పార్టీ పేరు అన్నా ద్రవిడ మున్నేట్ర కగజం. అక్కడ ద్రవిడ అనే శబద్ధంతో ఉన్న పార్టీలు ఐదు వరకూ ఉండగా.. వాటి పేర్లు వరుసగా డీకే పార్టీ, డీఎంకే, అన్నాడీఎంకే, ఎండీఎంకే, డీఎండీకే. వీటిటిలోని డీ అంటే ద్రవిడ అన్న పదానికి సూచిక.

జస్టిస్ పార్టీతో ఆత్మగౌరవ ఉద్యమం మొదలు

అప్పట్లో కాంగ్రెస్ బ్రాహ్మణ ఆధిపత్య ధోరణిలో ఉండేది కాబట్టి.. ఆత్మగౌరవం కోసం బ్రాహ్మణేతర పార్టీగా అవతరించింది జస్టిస్ పార్టీ. 1917లో మొదలైన ఈ పార్టీ.. ద్వారా ఆత్మగౌరవ ఉద్యమం మొదలైంది. తర్వాత ద్రవిడర్ కగజం, ద్రవిడ మున్నేట్ర కగజం, తమిళ జాతీయ పార్టీ, అన్నాడీఎంకే, ఎండీఎంకే ఇలా ద్రవిడ వాదాన్ని భుజానికెత్తుకుని ముందుకొచ్చిన పార్టీలు చాలానే. వీటిలో ప్రస్తుతం రెండు ద్రవిడ పార్టీలు మాత్రమే పెద్ద ఎత్తున క్రియాశీల రాజకీయాల్లో ఉన్నాయి.

2005లో విజయ్ కాంత్ పార్టీలోనూ ద్రవిడ పదం

2005లో సినిమా స్టార్ విజయ్ కాంత్ ద్రవిడ శబ్ధంతో పెట్టిన పార్టీనే చివరిది. తర్వాత సినిమా నటుల కోవలోంచి వచ్చిన కమల్, విజయ్ కూడా పార్టీలు పెట్టారుగానీ.. ఇందులో ద్రవిడ శద్ధం కనిపించలేదు. కమల్ మక్కల్ నీతి మయ్యం అంటూ తన పార్టీకి నామకరణం చేయగా.. విజయ్ పార్టీ పేరు తమిళ వెట్రి కళగం.

పార్టీలో ద్రవిడత్వం లేకున్నా.. కమల్ మాటలనిండా ద్రవిడ వాదమే

దేశంలో భాషల పరంగా ఆర్య, ద్రవిడ భాషలుగా విడిపోవడం. వాటి ద్వారానే ద్రవిడ వాదం అంటూ ఒకటి పుట్టుకొచ్చింది. వీటి ప్రధాన ఉద్దేశం ఒకటి హిందీని వ్యతిరేకించడం రెండు ద్రవిడ వాదం వినిపించడం. ఈ ద్రవిడ రాజకీయం విజయ్ కాంత్ వరకూ ఎంతో ప్రముఖంగానే సాగింది. కమల్, విజయ్ తమ పార్టీ పేర్లలో ఈ ద్రవిడ పదాన్ని తొలగించడంతో.. ఈ ద్రవిడ ప్రభావం తగ్గిందనే అనుకున్నారంత. అయితే కమల్ హాసన్ పార్టీకి ద్రవిడ పదం లేదన్న మాటేగానీ ఆయన రాజకీయం మొత్తం ద్రవిడత్వంతో ముడి పడి ఉంటుంది. అందులో భాగంగా ఆయన దక్షిణాది భాషా రాష్ట్రాలంతా ఒక్కటై కేంద్రంపై తిరుగుబాటు చేయాలన్న పిలుపునిచ్చారు.

నాన్ ద్రవిడియన్ పార్టీగా పేరు పడ్డ విజయ్ పార్టీ

ఒక రకంగా చెబితే విజయ్ ది మాత్రమే నాన్ ద్రవిడియన్ పార్టీగా చెప్పాల్సి ఉంటుంది. తమిళ స్పీకర్ చెప్పడాన్ని బట్టీ చూస్తే విజయ్ పార్టీ వెనక బీజేపీ ఉందని అంటారు. రజనీకాంత్ ద్వారా సాధ్యం కాని పని విజయ్ ద్వారా నెరవేర్చాలనుకోవడం ఇదే చెబుతుందని అంటారు తమిళనాడు స్పీకర్ అప్పావు.

ద్రవిడత్వంలోని మరో మతలబు స్థానికత

ఇప్పుడు తాజాగా సత్యరాజ్ నోటి వెంట పెరియార్ ద్రవిడ వాదం వినిపిస్తోంది. ఇక్కడ ఎవరెంత హిందుత్వం అవలంభించినా.. రాజకీయంగా మాత్రం అందరిదీ ఒకటే దారి. అదే ద్రవిడ దారి. ఈ దారిలో వారు ప్రయాణించకుంటే ఇక్కడ రాజకీయ మనుగడ కష్టం.

ఈ ద్రవిడత్వంలోని మరో మతలబు స్థానికత. స్థానిక నాయకత్వమే తమిళనాడును పాలించాలన్న కోణంలో మొదలైన ఉద్యమమే ద్రవిడ ఉద్యమం. అణ్ణాదురై నుంచి ఇప్పటి వరకూ తమిళనాడును పాలించిన వారంతా నాన్ కాంగ్రెస్ సీఎంలే. కాంగ్రెస్ ని రాష్ట్ర పాలన నుంచి దూరం చేయడమే ఈ ద్రవిడ రాజకీయం ప్రధాన ఉద్దేశం. అందుకే రజనీకాంత్ తాను ఆధ్యాత్మిక రాజకీయాలను చేయాలనుకుంటున్నట్టు ప్రకటిస్తే ఆయన్ను ఇక్కడి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. శీమాన్ వంటి వారు రజనీని పెద్ద ఎత్తున బెదిరించినట్టు కూడా కనిపించింది.

పవన్ అధికార పార్టీపై కామెంట్ల కాకతో గొడవ

తమిళ ప్రజలకు ఆధ్యాత్మికత, దైవ భక్తి ఎంతో ఎక్కువ. ఇక్కడ అడుగడుగునా వినాయకుడి గుడి కనిపిస్తుంది. కర్ణాటకలో లింగాయత్ ఒక మతం ఎలాగో.. తమిళనాట మురుగన్ పై భక్తి కూడా ఒక ప్రత్యేకమైన మతం లాంటిదే. సుబ్రహ్మణ్య స్వామికి చెందిన ఆరు క్షేత్రాలుండేది కూడా తమిళనాడులోనే. అవేంటో చూస్తే.. తిరుప్పరకుంద్రం, తిరుచెందూర్, పళని, స్వామిమలై, తిరుత్తణి, పళమురచోళై. అందుకే ఇక్కడ మురుగన్ మానాడు అనే సభ నిర్వహించారు.

# చెంపదెబ్బ తిన్నా.. బుద్ధిమారని పాకిస్తాన్?

జమ్మూ కాశ్మీర్: ఆపరేషన్ సిందూర్‌లో భారత్ నిర్వహించిన తీవ్ర దాడుల అనంతరం పాకిస్తాన్ మళ్లీ తన ఉగ్రశిబిరాల పునర్నిర్మాణాన్ని ప్రారంభించిందని రహస్య సమాచారం వెల్లడిస్తోంది. మేలో భారత్ చేసిన అత్యంత ఖచ్చితమైన వైమానిక దాడుల సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని పలు శిబిరాలు ధ్వంసమయ్యాయి. అయితే ఇప్పుడు పాక్ ఆర్మీ, , ప్రభుత్వ సహకారంతో కొత్తగా ఇవే శిబిరాలు తిరిగి నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమం ఖచ్చితమైన ప్రణాళికతో, ఉగ్రతత్వాన్ని కొనసాగించే సంకల్పంతో కొనసాగుతోంది.భారత గూఢచార సంస్థల విశ్లేషణల ప్రకారం, తాజాగా నిర్మించబడుతున్న శిబిరాలు అధునాతన సాంకేతికతతో కూడినవి. ఇవి ప్రధానంగా లైన్ ఆఫ్ కంట్రోల్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్నాయి. శాటిలైట్‌లు, డ్రోన్ల పర్యవేక్షణకు చిక్కకుండా ఉండేందుకు వీటినిదట్టమైన అడవుల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు. పాక్ సైన్యం ప్రత్యేక విభాగాల ఆధ్వర్యంలో ఈ శిబిరాలకు భద్రత కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. థర్మల్ సెన్సార్లు, తక్కువ ఫ్రీక్వెన్సీ రాడార్‌లు, డ్రోన్ కౌంటర్‌మెజర్లతో సాయుధ గార్డులు వీటిని కాపాడుతున్నారు.అయితే గతంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు, ఈసారి ఐఎస్?ఐ బాగానే పన్నాగం వేసింది. పెద్ద శిబిరాలను ఇప్పుడు చిన్నచిన్న శిబిరాలుగా విభజన చేసింది. ఒక్కో శిబిరంలో 200 మందికి మించి ఉగ్రవాదులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ చిన్న శిబిరాలు దాదాపు 20 ప్రదేశాల్లో నూతనంగా నిర్మాణంలో ఉన్నాయి. కేల్, సర్దీ, అత్మకాం, జూరా, లిపా, కహూటా, కోట్లీ, ఖుయిరట్టా, చమన్‌కోట్, జంకోట్ వంటి ప్రాంతాలు వీటిలో ప్రముఖమైనవి. గతంలో ధ్వంసమైన లునీ, పుట్వాల్, చాప్రార్ ఫార్వర్డ్, జంగ్లోరా వంటి ప్రాంతాల్లోనూ పునఃనిర్మాణంజరుగుతోంది.ఇక బహావల్పూర్‌లో ఇటీవల జరిగిన ఒక రహస్య సమావేశాన్ని కూడా భారత నిఘా సంస్థలు గుర్తించాయి. ఈ సమావేశానికి జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ టెర్రరిస్ట్? రెసిస్టెన్స్? ఫ్రంట్ వంటి ఉగ్రవాద సంస్థల నేతలు హాజరయ్యారు. ఐఎస్?ఐ ఉన్నతాధికారులు కూడా ఇందులో పాల్గొన్నట్లు సమాచారం. ఇందులో ముఖ్యంగా కొత్త కమాండ్ శ్రేణుల ఏర్పాటు, మళ్లీ శిక్షణా శిబిరాల నిర్మాణం, పాక్, కశ్మీర్ ప్రాంతాల్లో నియామకాలపై చర్చించారని తెలుస్తోంది. బహావల్పూర్ జైష్ ఉగ్రసంస్థకు కేంద్రంగా ఉండటంతో అక్కడ నిర్వహించిన ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది.ఒకవైపు అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్తాన్, మరోవైపు ప్రపంచ బ్యాంకు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ల నుండి వచ్చిన నిధులను కూడా ఈ ఉగ్ర శిబిరాల నిర్మాణానికి మళ్లిస్తున్నదని భారత రహస్య సంస్థలు పేర్కొంటున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం. అందుకే భారత్ అంతర్జాతీయ వేదికలపై ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది.ఇదిలా ఉండగా, ఆపరేషన్



సిందూర్ వివరాలను పరిశీలిస్తే.. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరులు మృతిచెందిన తర్వాత భారత ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకోవాలనే దృఢనిశ్చయంతో ఈ ఆపరేషన్ ప్రారంభించింది. మే 6వ తేదీ నుండి నాలుగు రోజులపాటు జరిగిన ఈ సర్జికల్ దాడుల్లో భారత వైమానిక దళం కీలకపాత్ర పోషించింది. చైనా నుంచి పాక్‌కు వచ్చిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ముందుగానే అడ్డుకుని, 23 నిమిషాల్లో లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులు జరిపింది. ఇస్రో ఉపగ్రహాల సహాయంతో ఉగ్రవాద స్థావరాలపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించి, ఆయా టార్గెట్లను గుర్తించి, అధునాతన ఆయుధాలతో పక్కాగా గురిచూసి దాడి నిర్వహించారు. మురిద్కేలోని మర్కజ్ తాయిబా, బహావల్పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా వంటి ప్రముఖ శిక్షణా కేంద్రాలను ధ్వంసం చేశారు. సుమారు 9 ప్రధాన స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.ఈ ఆపరేషన్ అనంతరం భారత్-పాక్ మధ్య మరోసారి కాల్పుల విరమణకు ఒప్పందం కుదరినా ఇప్పుడు పాకిస్తాన్ తిరిగి అదే పాత మార్గాన్ని అనుసరించడం గమనార్హం. భారత మిలిటరీ, ఇంటలిజెన్స్ వ్యవస్థలు నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం మళ్లీ ఏర్పడింది. పాక్‌కు అంతర్గతంగా ఉన్న అస్థిరతను దాచే ప్రయత్నంలో, ఉగ్రవాదాన్ని మళ్లీ ప్రోత్సహించడం వాస్తవానికి తీవ్ర ప్రమాదాన్ని కొని తెస్తోంది. తానే యుద్ధాన్ని ఆపానంటూ పదేపదే అదే పాట పాడుతున్న అమెరికా అధ్యక్షుడికి ఈ విషయాలేవీ తెలియకుండా ఉండవు. అయినా, ఆయన పాక్? ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌ను పిలిచి మరీ వైట్?హౌస్?లో విందు ఏర్పాటు చేసాడు. మునీర్‌ను గొప్ప నాయకుడిగా కీర్తించాడు. మరోవైపు భారత్?ను పొగుడుతూనే దాగుడుమూతలు ఆడుతున్న ట్రంప్?ను భారత్? పాకిస్తాన్? విషయంలో లెక్కపెట్టాల్సిన అవసరం లేదు. ఇరాన్?లో అణ్వాయుధాలు తయారుచేస్తున్నారని కేవలం ఊహామాత్రంగా తెలిస్తేనే దాడులు చేసిన అమెరికా, మా ఆటంబాబులు ప్రత్యేకంగా భారత్? కోసమే తయారుచేసామని మీడియాముఖంగా ప్రకటించిన ఆ దేశ రక్షణమంత్రి మాటలను ఉటంకిస్తూ, భారత్? పాక్?పై దాడిచేసినా ఏమనే పరిస్థితి లేదు.ప్రస్తుతం పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉన్నా, ఒకసారి ఉగ్రవాద కేంద్రాలు మళ్లీ జీవం పోసుకుంటే కశ్మీర్? మరోసారి అగ్నిగుండంగా మారడం ఖాయం.

## క్వాంటమ్ కంప్యూటింగ్‌ను అందిపుచ్చుకోవాలి

విజయవాడ,క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. 1990లలో ఇంటర్నెట్ వల్ల ప్రపంచం ఓ గ్లోబల్ విలేజ్‌గా మారిందని ఉద్ఘాటించారు. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టమ్ క్రియేట్ చేయాలని సూచించారు. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారిందని వెల్లడించారు. క్వాంటమ్ వ్యాలీపై విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 1995 టెక్నాలజీ రివెల్యూషన్‌ను ఇండియా పొందింది.. దానిలో తన పాత్ర కూడా ఉందని గుర్తుచేసుకున్నారు సీఎం చంద్రబాబు.ఏపీకి ఎన్నో అడ్వాంటేజీలు ఉన్నాయని.. శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ ఇక్కడే ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. ఏపీ గ్రీన్ ఎనర్జీలో చాలా బలంగా ఉందని చెప్పారు. 1989లో కుప్పం నుంచి పోటీచేస్తూ ఒక పబ్లిక్ మీటింగ్‌లో తాను ఎలక్ట్రానిక్ ఎక్స్ఛేంజ్ తెస్తానని చెప్పానని.. అయితే ఆ విషయంతో తన ప్రత్యర్థులు తప్పుపట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ సర్వీసులు అన్నిసేవలను ఆగస్టు 15వ తేదీ నాటికి వాట్సాప్ చాట్ బోట్ ద్వారానే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జనవరి ఒకటోవ తేదీ నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతి నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. దీనికోసం ఎకో సిస్టంతో పాటు యూజ్ కేస్‌లు కూడా రావాలని సూచించారు. టాప్ ఏఐ యూసేజ్‌లో చైనా, యూఎస్, ఇండియా మాత్రమే ముందు ఉన్నాయని వివరించారు. టీసీఎస్ మనతో ముందునుంచి ట్రావెల్ చేస్తోందని.. ఇప్పుడు డేటాలింక్‌పై పనిచేస్తుందని చంద్రబాబు వెల్లడించారు. 'నిజానికి క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేయాలనుకున్నాం. దీనిపై ముఖ్యమైన వ్యక్తులను ఆహ్వానించాలనుకున్నాం. ఆ సమయంలోనే భారత ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్‌ను అనౌన్స్ చేసింది. వెంటనే కామకోటి మా వద్దకు వచ్చి ఈ విషయం చెప్పారు. వెంటనే నేను కేంద్ర ప్రభుత్వాన్ని అడిగా... వారు ఓకే చెప్పారు. ఎలా ముందుకు వెళ్లాలని కూడా అడిగాం. ఈ రంగంలో మరింతమంది ముందుకు రావాలని ఎకో సిస్టంను టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ ద్వారా చేయగలిగాం. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టం క్రియేట్ చేయాలి. ఐటీని నేను 1983-84లోనే అప్లైడ్ చేశాను. లోకేష్ పుట్టిన సమయం అది. దానిలో భాగంగా నేను అమెరికా వెళ్లాను.... మైక్రోసాఫ్ట్‌తో పాటు అన్ని నగరాలు తిరిగి ప్రయత్నం చేశాను. బ్రిటిష్ వాళ్లు మన కోహినూరు డైమెండ్‌ను తీసుకుపోయినా.. ఇక్కడ ఇంగ్లీష్ వదిలి వెళ్లారు. నేను అమెరికా నుంచి తిరిగి రాగానే అనేక ఇంజనీరింగ్ కాలేజ్‌లు ప్రారంభించి ఐటీ ఎడ్యూకేషన్‌ను పెంచాను. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారింది.

# ఉమ్మడి పౌరస్మృతిపై కానరాని కదలిక...




న్యూఢిల్లీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును తీసుకుని రాగలదా అన్నచర్చ సాగుతోంది. దీనిపై ఏకాభిప్రాయం మాత్రం రాదని విపక్షాల తీరును బట్టి తెలుస్తోంది. విపక్షాలు కూడా ఈ విషయంలో తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం దీనిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించడం ద్వారా ముందుకు తీసుకుని రావాన్న ప్రయత్నాలు సాగడం లేదు. ఇప్పటికే దీనిపై అనేక రాజకీయ పక్షాలు విమర్శల దాడిని పెంచాయి. అయితే గత సార్వత్రిక ఎన్నికలకు ముందే దీనిని తీసుకుని వస్తారని అనుకున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలైలో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటుకు సమర్పించి, అనంతరం దానిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించే అవకాశం ఉందని అంటున్నారు. సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం షెడ్యూలు ప్రకారం, లా కమిషన్, లీగల్ అ్గ÷ర్స్, న్యాయ మంత్రిత్వ శాఖలలోని లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్స్ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. దేశంలోని అన్ని వర్గాలవారికి, ప్రతి ఒక్కరికీ ఒకే చట్టం అమలు కావాలని గతంలో మోడీ పదేపదే చెప్పారు. ఈ సున్నితమైన అంశంపై ముస్లింలను కొందరు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. యూసీసీని తీసుకురావాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న వారు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఒక దేశం రెండు రకాల వ్యవస్థలను ఎలా అమలు చేయగలదని ప్రశ్నించారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల్లో యూసీసీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. భారత రాజ్యాంగంలోని అధికరణ 44 కూడా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని చెప్తోంది. మోదీ వ్యాఖ్యలతో గత రెండుమూడేళ్లుగా యూసీసీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మణిపూర్ హింసాకాండ వంటి సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ యూసీసీ అంశాన్ని లేవనెత్తుతున్నారని దుయ్యబడుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వస్తే వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి అంశాల్లో దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులకు వేర్వేరు వ్యక్తిగత చట్టాలు అమలవుతున్నాయి. హిందూ చట్టాల ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిలో వారసత్వ హక్కులు పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఉన్నాయి. క్రైస్తవులకు వర్తించే చట్టం ప్రకారం క్రైస్తవ మహిళలకు ముందుగా నిర్ణయించిన వాటా మాత్రమే లభిస్తుంది. పిల్లలు, ఇతర బంధువులు ఉండటాన్ని బట్టి ఈ వాటా ఉంటుంది. పారశీక మతానికి చెందిన మహిళ తన భర్త మరణించినట్లయితే, తన పిల్లలతో సమాన వాటాను పొందవచ్చు. ముస్లిం మహిళలకు తమ తండ్రి ఆస్తిలో పురుషులకు లభించే వాటాలో సగం లభిస్తుంది. అంతేకుండా చట్టాలు సమానంగా ఉంటాయి. అయితే దీనిని తీసుకుని రావడం ఎంతవరకు విజయం సాధిస్తుందన్నదే ప్రశ్న.

# ఏపీలో 50, తెలంగాణలో 34 పెరగనున్న అసెంబ్లీ స్థానాలు

హైదరాబాద్,దేశంలో పార్లమెంటు స్థానాలను పునర్విభజించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ స్థానాలను పెంచనున్నారు. రాష్ట్ర విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలను పెంచాలని అనుకున్నా, ఇంతకాలం ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడు దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ చేపట్టాలని నిర్ణయించడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి చెబుతున్నారు.డీలిమిటేషన్ ప్రక్రియతో రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 84 అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా, అదనంగా 50 పెరుగుతాయని చెబుతున్నారు. దీంతో ఏపీ అసెంబ్లీ స్థానాల సంఖ్య 225కు చేరనుంది. అదేవిధంగా తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 స్థానాలు 153కి పెరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ రాష్ట్రంలో కొత్తగా 34 అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.దేశంలో 2014 తర్వాత జనగణన జరగకపోవడంతో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల పునర్విభజన జరగలేదు. తాజాగా జనగణనకు కేంద్రం సై అనడంతో అసెంబ్లీ స్థానాల పునర్విభజన ప్రక్రియకు అవాంతరం తొలగిపోయినట్లు భావిస్తున్నారు. 2026లో జనగణన, కులగణన చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. దీంతో 2027లో డీలిమిటేషన్ చేపట్టి అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను పెంచిన తర్వాతే 2029 ఎన్నికలకు వెళ్లాలనేది కేంద్ర ఆలోచనగా చెబుతున్నారు.వాస్తవానికి చాలా కాలంగా పార్లమెంటు స్థానాల పెంపు ప్రతిపాదన ఉంది. ప్రస్తుత జనాభా ఆధారంగా పార్లమెంటు స్థానాలను పెంచాలని కేంద్రానికి కొన్ని ప్రతిపాదనలు అందినట్లు చెబుతున్నారు. అయితే జనాభా ఆధారంగా పార్లమెంటు స్థానాలను పెంచితే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే వాదన తెరపైకి వచ్చింది. బిహార్,



ఉత్తరప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లు పెరుగుతాయని, ప్రాంతీయ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే ఈ ప్రతిపాదనను కేంద్రం ఖండిస్తూ వస్తోంది. ఇంతవరకు జనాభాపై కచ్చితమైన లెక్కలు లేకపోవడంతో పార్లమెంటు స్థానాల పునర్విభజన సాధ్యం కాదని కేంద్రం స్పష్టం చేస్తూ వస్తోంది. మరోవైపు జనాభాతో ముడిపెట్టకుండా ప్రతి రాష్ట్రంలో కనీసం 20 శాతం స్థానాలు పెంచాలని కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ గందరగోళ పరిస్థితుల నడుమ కేంద్రం జనగణన చేపట్టాలని నిర్ణయించడంతో ఊహాగానాలకు తెరపడింది. జనగణన లెక్కలు తేలిన తర్వాత జనాభాపై స్పష్టత వస్తుంది. ఆ తర్వాత అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను పెంచేందుకు ఎటువంటి అడ్డంకులు ఉండవని కేంద్రం భావిస్తోంది. మొత్తానికి పార్లమెంటు స్థానాలు పెంపు నిర్ణయంతో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీల సంఖ్య పెరిగనుందని వార్తలు వస్తున్నాయి.

# జగన్నాథుని రథయాత్రలో వారెలా చనిపోయారు?

న్యూఢిల్లీ,ప్రపంచ ప్రఖ్యాత పూరీ జగన్నాథుని రథయాత్రలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఏటా ఆషాఢ శుద్ధ విదియ తిథి నుంచి 12 రోజులు జరిగే ఈ రథయాత్రకు దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తారు. అశేష జనంతో పూరీ కిటకిటలాడుతుంది. ఈ ఏడాది కూడా అలానే జరిగింది. అయితే.. గతంలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. కొన్ని ఆంక్షలు విధించేవారు. ఈ సారి బీజేపీ సర్కారు ఎలాంటి ఆంక్షలు లేకుండానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆరోపణలు వస్తున్నాయి.దీంతో లక్షల సంఖ్యలో వచ్చిన భక్తుల భద్రతకు ప్రాధాన్యం లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. రథయాత్రలో కీలక ఘట్టమైన.. గుండిచా ఆలయం వద్దకు మూడు రథాలు చేరుకున్న తర్వాత.. ఆయా రథాల్లోని మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా ఎగబడ్డారు. గతంలో దీనిని ఓ క్రమ పద్ధతిలో చేసేవారని స్థానికులు మీడియాకు తెలిపారు. ఈ దఫా ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో మూర్తులను దర్శించుకునేందుకు వచ్చిన వారు ఒకరిపై ఒకరు తోసుకున్నారు.దీంతో తీవ్ర తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈఘటన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగానే భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ వ్యవహారంపై



బీజేపీ ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. వెంటనే బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు.. ఆసుపత్రులకు తరలించింది. ఇదిలావుంటే.. ఏటా జరిగే జగన్నాథుని రథయాత్రలో గతంలో ఎప్పుడూ మరణాలు చోటు చేసుకోలేదని.. ప్రభుత్వమే జాగ్రత్తలు తీసుకుందని ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న బీజేడీ నాయకులు విమర్శలు గుప్పించారు.

# జగన్‌కు షర్మిల ఒక ప్లస్.. రెండు మైనస్ ..!



అమరావతి,వైసిపి అధినేత జగన్‌కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితిలు కనిపిస్తున్నాయి. ఎక్కడికి వెళ్లినా.. ఏం మాట్లాడినా.. షర్మిల తీవ్ర స్థాయిలో జగన్ ను టార్గెట్ చేస్తున్న విషయం తెలిసిందే. విషయం ఏదైనా జగన్ మాట ఉండాల్సిందే. జగన్ను విమర్శించాల్సిందే. ఇది ఇప్పుడే కాదు.. షర్మిల గత ఏడాదిన్నర కాలంగా అనుసరిస్తున్న బాట. అయితే. నిజంగానే షర్మిల ఈ లైన్ లో వెళ్లడం వల్ల ఆమె గ్రాఫ్ ఎలా ఉన్నా వైసిపికి భారీ నష్టమా? అంటే గత ఏడాది ఎన్నికలను గమనిస్తే నష్టపోయిన విషయం వాస్తవం.ఎంతో కొంత షర్మిల వల్ల ఓటు బ్యాంకు దూరమైంది. మహిళలు దూరమయ్యారు. అయితే ఇప్పుడు రాబోయే పరిస్థితిని గమనిస్తే షర్మిలకు ఉన్న రాజకీయ అనుభవం, రాజకీయ పరిజ్ఞానం గమనిస్తే ఆమె చేస్తున్న విమర్శలు తరచుగా అన్నతో పాటు కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న తీరు వంటివి జగన్కు కూడా కలిసి వచ్చే అంశాలే అని పరిశీలకులు భావిస్తున్నారు. ఒకటి షర్మిల వల్ల జగన్ కు కొంత నష్టం జరుగుతున్నా.. ఇకముందు మాత్రం ఆమె జగన్‌ను దాదాపు విమర్శించడం తగ్గించే అవకాశం కనిపిస్తుంది. ఎందుకంటే జగను విమర్శించడం వల్ల ఓటు బ్యాంకు రావడం లేదనేది అదే విధంగా సీనియర్ నాయకులు కలిసి రావడం లేదనేది ఆమెకు అర్థమైంది. పైగా ఆమెపై కూడా ఒత్తిడి పెరుగుతుంది. దీనివల్ల కూటమిని టార్గెట్ చేసుకునే పరిస్థితి వచ్చింది. ఇది ప్రత్యక్షంగా కాంగ్రెస్కు మేలు చేస్తుందా అంటే కొత్త మేరకు చేయొచ్చు. కానీ ఎక్కువగా దీనివల్ల జగన్ కి మేలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. కూటమి పాలనపై వైసీపీ ఇప్పటికే పోరుబాట పట్టింది. అయితే దీనికి మద్దతుగా షర్మిల కూడా కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం వల్ల జగన్ చెబుతున్నది వాస్తవమేనన్న మాట ప్రజలకు చేరువ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అంటే ఒక రకంగా షర్మిల వల్ల కొన్ని మైనస్లు ఉంటే అదే షర్మిల వల్ల ఒకటి రెండు ప్లస్ లు కూడా వైసిపికి కనిపిస్తున్నాయి.కాబట్టి పూర్తిస్థాయిలో షర్మిల వల్ల వైసీపీ కి ఇప్పట్లో పెద్ద నష్టమైతే కనిపించకపోవచ్చు.. గత ఏడాది అయితే నష్టపోయినా వచ్చే ఎన్నికల నాటికి షర్మిల చేస్తున్న యాంటీ ప్రచారం వైసిపి చేస్తున్న యాంటీ ప్రచారానికి పాలు నీళ్లలాగా తోడ అయ్యే అవకాశం ఉంది. అలా అని వీరిద్దరు పొత్తు పెట్టుకుంటారని కాదు. ఒక యాంటీ ప్రచారం మొదలైనప్పుడు గత ఎన్నికల్లో టిడిపి జనసేన ఎలాగైతే యాంటీ ప్రచారం చేశాయో అలాగే ఇప్పుడు కూడా కాంగ్రెస్ వైసిపి యాంటీ ప్రచారం వల్ల వైసీపీకి మేలు జరుగుతుందని పరిశీలకులు వేస్తున్న అంచనా. మరి ఏం జరుగుతుందనేది భవిష్యత్తు తేల్చాలి.

# టార్గెట్ టీడీపీ.. "విషయం చాలా దూరం వెళ్తుంది" అంటూ ఏబీవీ హెచ్చరిక



అమరావతి,రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ), టీడీపీ అధిష్టానం మధ్య తెరచాటు యుద్ధం తొలగిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. గత ప్రభుత్వంలో తనకు జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వంలో న్యాయం జరగ లేదన్న అసంతృప్తితో ఏబీవీ రగిలిపోతున్నారని ప్రచారం జరుగుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో అన్యాయానికి గురైన వారి పక్షాన పోరాటం చేస్తానని స్వయంగా ప్రకటించిన ఏబీవీ.. అందుకు విరుద్ధంగా టీడీపీపై పోరాడాలనే పరిస్థితులు దారితీస్తున్నాయని అంటున్నారు.టీడీపీ స్పాన్సర్డ్ యూట్యూబ్ చానళ్లలో కొందరు జర్నలిస్టులు తనపై చేస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తున్న ఏబీవీ.. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ తన ఎక్స్ ఖాతాలో సుదీర్ఘ పోస్టు రాశారు. తనపై అవాకులు, చవాకులు మాట్లాడటం ఆపకపోతే... విషయం చాలా దూరం వెళుతుందని ఏబీవీ హెచ్చరించడం చర్చనీయాంశం అవుతోంది.టీడీపీ సానుభూతిపరుడిగా ముద్రపడి గత ప్రభుత్వంలో ఐదేళ్లు పోస్టింగు లేక, జీతం అందక నానా ఇబ్బందులు ఎదుర్కొన్న రిటైర్డ్ ఐపీఎస్ ఏబీవీ సుదీర్ఘ న్యాయపోరాటంతో విజయం సాధించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు 9 నెలల అనంతరం ఆయన సర్వీసు రెగ్యులర్ చేసి జీతభత్యాల బకాయిలను చెల్లించాలని ఆదేశించింది.అయితే ఇంతవరకు అవి అమలు కాలేదని ఏబీవీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం తన పట్ల అరాకచకంగా వ్యవహరించినా టీడీపీ నుంచి ఆశించిన మద్దతు లభించలేదన్న అసంతృప్తి ఏబీవీలో కనిపిస్తోందని అంటున్నారు. దీంతో జగన్ పై యుద్ధం ప్రకటించిన ఆయన తన టార్గెట్ ను సవరించి అధికార పార్టీపైన ఇటీవల విమర్శలు ఎక్కుపెడుతున్నారు.ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఆలోచన పరుల వేదిక సమావేశంలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదన చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై ఏబీవీ విమర్శలు గుప్పించారు. ఆ ప్రాజెక్టు వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోవడమే తప్ప, ఏం లాభం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రజా పోరాటానికి పిలుపునిచ్చారు. దీనిపై టీడీపీ స్పాన్సర్డ్ యూట్యూబ్ చానళ్లలో ఖండన ప్రకటనలు వచ్చాయి. ఇద్దరు జర్నలిస్టులు ఏబీవీ వ్యాఖ్యలపై సుదీర్ఘంగా సుమారు 30 నిమిషాల వీడియో చేశారు. దీనిపై ట్విటర్ వేదికగా స్పందించిన ఏబీవీ ఆ ఇద్దరు జర్నలిస్టులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. అంతేకాకుండా టీడీపీపై తన అసంతృప్తికి కారణాలను పరోక్షంగా వెల్లడించారు."సీనియర్ జర్నలిస్టు సత్యమూర్తి గారూ – మీరు, రామబ్రహ్మం గారు చేసిన 30 నిమిషాల వీడియో చాలా నేల బారుగా ఉంది. మీ దగ్గర విషయం లేదని పూర్తిగా బహిర్గతమైంది.దీనికి సరైన సమాధానం ఒక వీడియో లేదా ఇంటర్వ్యూ ద్వారా వివరంగా త్వరలో చెబుతాను గానీ, నా మీద సుపారీ దాడులకు పాల్పడవద్దని మీలాంటి వారందరికీ నా సలహా. సద్విమర్శలకు ఎప్పుడూ స్వాగతం." అంటూ ఏబీవీ ట్వీట్ చేశారు. అంతేకాకుండా తన ఆవేదనను ఆ ట్వీట్ లో వెల్లడించారు. "గత ఐదేళ్ళ జగన్ మోహన్ రెడ్డి అన్యాయపు కక్ష సాధింపుకు వ్యతిరేకంగా ఒంటరి పోరాటం చేశాను. ఐదేళ్ల సర్వీసు పోగొట్టుకున్నాను. పదుల లక్షల రూపాయల ఖర్చైంది. ఏ నాడూ ఎవరి సహాయం కోరలేదు. అయ్యో.. మా వల్ల ఇబ్బందుల్లోకి వచ్చాడే, సహాయం కావాలా అని అడిగిన వారు లేరు." అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.జగన్ ప్రభుత్వంపై %జూ%, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పోరాడానని గుర్తు చేశారు. చివరికి ఆధారాలు లేని పరమ చెత్త కేసని హై కోర్టు తనపై నమోదుచేసిన %ఖీ×=%ని కొట్టేసిందని, అంత చెత్త కేసు విషయంలో సమాంతరంగా సాగిన శాఖా పరమైన విచారణ మూసెయ్యడానికి మంచి ప్రభుత్వానికి 9 నెలల సమయం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదీ చెప్పులరిగేదాకా తిరిగితేనే చంద్రబాబు ప్రభుత్వం తనపై ఎఫ్ఐఆర్ కొట్టివేసిందని చురకలు అంటించారు. తన విషయంలో చెప్పులు అరిగేలా తిరిగితేనే పనిచేశారన్న ఆవేదన ఏబీవీలో కనిపిస్తోందని ఆ ట్వీట్లో ఏబీవీ అసహనం వ్యక్తం చేశారు.ఇక తనకు రావాల్సిన జీత భత్యాల బకాయిలు సగం మేర ఇంకా రాలేదని, పెన్షన్ సెటిల్ కాలేదని, వాటి కోసం ఇంకా తిరుగుతూనే ఉన్నానని ఏబీవీ వాపోయారు. టీడీపీ ఆఫీసు నుంచి నడిపే మీ ఛానెల్లో నేను ఏదో ఆశించి, భంగపడి, ఇదంతా చేస్తున్నానని అవాకులు చెవాకులు పేలతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అనే భూతాన్నుంచి నా రాష్ట్రాన్ని రక్షించుకోవడమనే పని తప్ప నేనేమన్నా గనులు అడిగానా, మణులు అడిగానా? ఇది కాక మీకేమన్నా తెలిస్తే బహిరంగంగా చెప్పండి. అంతేకానీ ఆ తప్పుడు సంజ్ఞలు, నిగూఢార్థపు మాటలు ఎందుకు? బనకచర్ల కానీ ఇంకొక సబ్జెక్ట్ మీద కానీ చర్చకు ఎప్పుడూ సిద్ధమే. అలా కాకుండా వ్యక్తిగత దూషణలకు దిగితే విషయం చాలా దూరం వెళ్తుంది. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడండి. మిమ్మల్ని పురమాయించిన వాళ్లకు కూడా చెప్పండి అంటూ ఏబీవీ తీవ్ర హెచ్చరికలు పంపారు.టీడీపీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి బాగా సన్నిహితుడైన ఏబీవీ ఆవేదనపై టీడీపీ శ్రేణుల్లో సానుభూతి వ్యక్తమవుతోంది. తమ కోసం పోరాడిన వ్యక్తికి న్యాయం చేయలేదన్న ఆవేదన కనిపిస్తోందని అంటున్నారు. అయితే టీడీపీ అనుబంధ యూట్యూబ్ చానళ్లలో ఏబీవీ పట్ల వ్యతిరేక కథనాలు రావడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. పోలీసు హౌసింగ్ బోర్డు చైర్మన్ పదవి ఇచ్చినా తీసుకోని ఏబీవీపై విమర్శలు చేయడం మానుకోవాలని కేడర్ నుంచి సూచనలు వెళుతున్నాయి. అయితే ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లిందో లేదో కానీ, గ్యాప్ మాత్రం రోజురోజుకు పెరిగపోయే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు.

# ఏకైక- హ్యాట్రిక్ ఎమ్మెల్యే.. రాజాసింగ్ దారెటు.. కాంగ్రెస్-బీఆర్ఎస్?

హైదరాబాద్,2014లో తెలంగాణలో గెలిచిన ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేల్లో ఒకరైన రాజాసింగ్.. ఇప్పుడు ఆ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణలో 2018లో గెలిచిన ఏకైక బీజేపీ శాసనసభ్యుడైన రాజాసింగ్ ఇప్పుడు కమలం పార్టీకి దూరమయ్యారు. మరి ఆయన దారులు ఎటు...?2023లో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. వారిలో రాజాసింగ్ ఒకరు. మిగతావారికంటే ఈయన భిన్నం.. ఎందుకంటే హ్యాట్రిక్ ఎమ్మెల్యే. బహుశా తెలుగు రాష్ట్రాల్లో హ్యాట్రిక్ కొట్టిన బీజేపీ ఎమ్మెల్యే ఈయనేనేమో...? లేదా ఆ ఒకరిద్దరిలో రాజాసింగ్ ఒకరేమో?పాతబస్తీలో గోషామహల్ నుంచి మూడోసారి గెలిచిన రాజాసింగ్ బీజేపీకి రామ్ రామ్ చెప్పారు. మజ్లిస్ పార్టీకి పట్టున్న ఈ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తూ వస్తున్న రాజాసింగ్ మరిప్పుడు ఏం చేస్తారు? స్వతంత్ర ఎమ్మెల్యేగా ఉంటారా? లేక బీఆర్ఎస్ లో చేరుతారా? అధికార కాంగ్రెస్ వైపు మొగ్గుతారా? అనేది ఆసక్తికరంగా మారింది.రెండేళ్ల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజాసింగ్ బీజేపీ శాసనసభా పక్ష నేత పదవిని ఆశించారు. కానీ, కొన్ని అంశాల ప్రాతిపదికన ఏలేటి మహేశ్వర్ రెడ్డికి ఇచ్చారు. బీజేపీలో కేంద్ర మంత్రి బండి సంజయ్ అండదండలు ఉన్నప్పటికీ రాజాసింగ్ కు నిరాశ తప్పలేదు. అప్పటినుంచి పార్టీతో ఆయన అంటీముట్టనట్లు ఉంటున్నారు. విమర్శలు కూడా చేస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో ప్రచారం కూడా చేయలేదు. హైదరాబాద్ నియోజకవర్గంలో మహిళను నిలిపినా మద్దతు కూడా ప్రకటించలేదు.రాజాసింగ్ వ్యాఖ్యలను బట్టి చూస్తుంటే ఆయన



తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? అనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డిని పలుసార్లు ప్రశంసించారు. మరోవైపు రాజాసింగ్ బీఆర్ఎస్ వైపు మొగ్గడానికి అవకాశం తక్కువే. ఆ పార్టీకి రాజాసింగ్ దూరం అన్నట్లుగానే ఉంటుంది వ్యవహార శైలి. రెండూ కూడా కాకుండా రాజాసింగ్ బీజేపీలోనే కొనసాగే చాన్సులు ఎక్కువ. ఆయనపై ఇప్పటికే పలు వివాదాస్పద వ్యాఖ్యల కేసులు ఉన్నాయి. అందులోనూ పాతబస్తీలో నెగ్గాలంటే రాజాసింగ్ కు బీజేపీ వంటి పార్టీనే అవసరం. అటు బీజేపీకి కూడా రాజాసింగ్ ను వదులుకునే ఉద్దేశం ఉండదు. కాబట్టి ఆయనను బుజ్జగించి పార్టీలోనే కొనసాగించే అవకాశాలే అధికం.

# బంకర్-బస్టర్ బాంబుల తయారీకి భారత్ అడుగులు..



న్యూఢిల్లీ,జూన్ 22న అమెరికా తన B-2 బాంబర్ విమానాల నుంచి ఇరాన్‌లోని ఫోర్డో అణు కర్మాగారంపై బంకర్-బస్టర్ (GBU-57/A మాసివ్ ఆర్డినెన్స్ పెనెట్రేటర్స్) బాంబులను జారవిడిచిన విషయం తెలిసిందే. ఈ వైమానిక దాడిలో ఇరాన్ కి చెందిన ప్రధాన అణు కర్మాగారం తీవ్రంగా ధ్వంసమైంది. వాస్తవానికి, ఇరాన్ పర్వతాల మధ్య భూమికి100 మీటర్ల లోతులో ఫోర్డో అణు కర్మాగారాన్ని నిర్మించింది. ఇది సాధారణ బాంబుల ద్వారా దెబ్బతినే అవకాశమే లేదు. అందుకే అమెరికా ఈ అణు కర్మాగారంపై బంకర్-బస్టర్ బాంబులను వేయాలని నిర్ణయించుకుంది. ఈ బాంబులు 60 నుంచి 70 మీటర్ల రంధ్రం చేస్తే.. భూమిలోకి చొచ్చుకుపోయాయి. ఆపై పెద్ద శబ్దంతో పేలిపోతాయాయి. అంటే, ఈ బాంబులను శత్రువులకు చెందిన భూగర్భ బంకర్లను ఈజీగా నాశనం చేస్తాయి. అందుకే భారత్ కూడా అధునాతన బంకర్-బస్టర్ బాంబులను తయారు చేసేందుకు ప్రయత్నాలను వేగవంతం చేసింది. బంకర్-బస్టర్ సామర్థ్యాలను అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం తన ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నట్లు తెలిపాయి. భూగర్భ లక్ష్యాలను ఛేదించగల శక్తివంతమైన కొత్త క్షిపణి వ్యవస్థను నిర్మించడం ద్వారా భారత్ భవిష్యత్ యుద్ధాలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అగ్ని-5 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సంస్కరణను అభివృద్ధి చేస్తోంది. ఇది 5,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధిని కలిగి ఉంటుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com